# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 2 పరాభవ - ఆశ్వయుజ శుద్ధ విదియ, 12 అక్టోబరు 2026


## శతావధాని సిరసినహళ్ కృష్ణమాచార్యులు

(1905-1992)

చం. అలికులవేణి యొక్కతు రయంబున వీధిన బాదచారియై
చలనము చేయగాను ముఖచంద్రుని యందున ఘర్మబిందువుల్
మొలువగ గాంచి యొక్క విటముఖ్యుడు పల్కెను చందమామపై
తళతళ కాంతిచే బవలు తారలు బుట్టె నిదేమి చోద్యమో




ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్



‘అవధాన పుష్కరిణి’ 2026-26 వార్షిక సంచిక డి.టి.పి. ప్రతిని ఆశీర్వదిస్తున్న
శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారు

# అవధాన పుష్కరిణి

సంపుటి - 2    అంతర్జాల మాస పత్రిక    సంచిక - 2

పరాభవ - ఆశ్వయుజం 2026    12-10-2026    ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్    R.No.691/2026


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య
కుంతి

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
డా॥ మారేపల్లి వేంకట పట్వర్ధన్
డా॥ ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు సహృదయులు ఆర్థికంగా సహకరించగలరు.
బ్యాంకు వివరాలు
**Avadhana Vidya Vikasa Parishat**
Ac. no. 60589741600;Bank of Maharashtra
Malkajgiri branch; MAHB0000955


అవధానవిద్యా విజయతే తరామ్

## సంపాదకీయం

# కష్టావలంబనము

**భూ**మిరాపో౽నలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥

"భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు, వీటితో పాటు మనస్సు, బుద్ధి, అహంకారము అనే ఈ ఎనిమిది పదార్థాలు నా భౌతిక శక్తి (ప్రకృతి) యొక్క ఎనిమిది విభాగాలు." వీటినే సృష్టికి మూలమైన అష్టప్రకృతులంటారని కృష్ణ పరమాత్మ భగవద్గీతలోని ఏడవ అధ్యాయం (జ్ఞానవిజ్ఞాన యోగం)లో చెప్పిన 4వ శ్లోకం ఇది.

మొదటి ఐదు దైహికాలు, అంటే స్థూలదేహ నిర్మాణానికి ఉపాదానములు. తరువాత మూడు అంతరములు అంటే సూక్ష్మ దేహ నిర్మాణ కారకములు.

ఏదోవిధంగా ఈ ఎనిమిది చిత్తవృత్తులను నిరోధించడానికి చేసే ప్రయత్నమే ఆత్మసాధనలో బలీయం. అదేవిధంగా అవధానంలోనూ అష్టవిధప్రకృతులకు ప్రతీకలుగా అష్ట ప్రాశ్నికులను సంభావించుకుంటే అవధాని చిత్తవృత్తి నిరోధానికి వారుచేసే యథాశక్తి ప్రయత్నమే అవధాన యోగసాధనం. ఏకాగ్రతను భగ్నం చేసి అస్తవ్యస్త ప్రశ్నలతో చీకాకుపెట్టి, అవధానిని గమ్యం చేరకుండా అడ్డుకోవడమే ప్రష్టలపని. యోగతుల్యమైన మహావధాన ప్రణేతగా అవధాని నిశ్చలంగా అక్షర పరబ్రహ్మ నుపాసించాలి.

బ్రహ్మానంద సహోదరమైన కావ్యానందాన్ని పంచాలి. ఈ యజ్ఞదీక్షలో పద్యాలే మంత్రాలుగా, మధురసవాక్యాలే అంగన్యాస కరన్యాసాలుగా, ధారణ ధోరణీయుత హావభావాలే యుద్ధవిన్యాసాలుగా జపిస్తూ, తపిస్తూ ప్రాశ్నికులను నిరుత్తరులను చేసేదాకా అవధాని పోరాడి విజయం సాధించాలి. ప్రాశ్నికులు సంధించిన గ్రంథగ్రంథుల చిక్కుముడులు ఒక్కటొక్కటిగా విడిపోతూ ఉంటే ప్రేక్షకులు ఆనందాశ్చర్యచకితులౌతారు.

నిజానికి పంచభూతాలనూ, మనస్సునూ అణచివేయడం అంత తేలికైన విషయం కాదు. అదేవిధంగా సావధాన చిత్తత అంత సులభసాధ్యంకాదు. అందుకే తిరుపతి వేంకట కవులు అష్టావధానాన్ని కష్టావలంబనమన్నారు. యోగ సాధకుడు చిత్తవృత్తులను నిరోధించి అంతరాత్మను దర్శించడానికి ప్రయత్నిస్తే,

(మిగతా 2వ పేజీలో)



# సంస్తుతి



సీ. చంద్రఖండకలాపు, జారువామనరూపు,
గలిత చంచలకర్ణు, గమలవర్ణు,
మోదకోజ్జ్వలబాహు, మూషకోత్తమవాహు,
భద్రేభవదను, సద్భక్తసదను,
సన్మని స్తుతిపాత్రు, శైలసంభవపుత్రు,
ననుదినామోదు, విద్యాప్రసాదు,
పరమదయాభ్యాసు, బాశాంకుశోల్లాసు,
నురుతరఖ్యాతు, నాగోపవీతు,
తే.గీ. లోకవందిత గుణవంతు, నేకదంతు,
నతులహేరంబు, సత్కరుణావలంబు,
విమలరవికోటితేజు, శ్రీవిఘ్నరాజు
బ్రథిత వాక్ప్రౌఢి సేవించి ప్రస్తుతింతు".

**– ఆతుకూరి మొల్ల, రామాయణం**

## సంపాదకీయం

(1వ పేజీ తరువాయి)

అవధాని అనేక చిత్తవృత్తులను సమన్వయపరచి అక్షరసృష్టి ద్వారా తన అంతః ప్రతిభను ఆవిష్కరిస్తాడు. ఈ రెండు సాధనల్లో విధానభేదం ఉన్నా, ఏకాగ్రత, ధారణ, నియమం, నిరంతర సాధన అనే అంతర్గత సూత్రాలు ఒకే విధంగా కనిపిస్తాయి.

అవధానిపరంగా సాధనగా, ప్రష్టల పరంగా సాధ్యంగా, పారిషదుల పరంగా దుస్సాధ్యంగా అనిపిస్తూనే సభనంతటినీ ఒకానొక ఉపాసనాస్తారంలోకి లాక్కొనిపోయే గొప్ప విద్య ఇది. ఇలాంటి భావనకరువైన వాళ్ళకు అవధానం కేవలం ఒక సారస్వత క్రీడమాత్రమే.

## ఇదీ క్రమణిక


1. సత్కవిప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం .. 3
2. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... . 4
3. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 5
4. అంశావలోకనము ... ... ... ... ... ... ... 6
5. పద్యపరీమళం ... ... ... ... ... ... 7, 22
6. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 8
7. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 10
8. యతిప్రాస వివేచనము -4... ... ... ... ... 12
9. పూరణతోరణం ... ... ... ... ... ... ... .. 14
10. అవధాన చరిత్రలో అద్భుత అధ్యాయం... ... 16
11. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 21
13. అవధాన విద్యా వాచస్పతి చెఱువు సత్యనారాయణ శాస్త్రి గారి అవధాన సేవ ... ... ... .... ... 23
14. ఆశుకవితా పద్యవిన్యాసంలో అపూర్వఘట్టం.. 24


## సహృద్వాణి

సెప్టెంబరు సంచిక అంశావలోకనంలో నరాల రామారెడ్డి గారు పూరణలను వివరిస్తూ కొనసాగిన ఆముదాల మురళి గారి వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంటూ సమస్య దత్తపదుల పూరణలలో అవధాని చూపిన ప్రతిభా విశేషాలను చక్కగా ప్రదర్శించినది. అంతే కాక ఒకే సమస్యను రామారెడ్డి గారితో పాటు ఇతర అవధానులు పూరించిన విధానాన్ని సైతం ప్రస్తావిస్తూ సాగటం ఛాత్రావధానులకు ఎంతో ఉపయోగకరం.

**– భళ్ళమూడి సూర్యనారాయణ,**
**విశ్రాంత అధికారి (ప్రొడ్యూసర్), టి-శాట్, హైదరాబాద్**

ఎప్పటిలాగే సెప్టెంబరు సంచిక కూడా విభిన్న వ్యాసాలతో అలరారింది. ముఖ్యంగా పద్యపరీమళం శీర్షికన వస్తున్న విశ్లేషణలు ఆకట్టుకుంటున్నాయి. ఏ నెల కా నెల జరుగుతున్న అవధాన విశేషాలను కూడా ప్రచురించడం స్ఫూర్తిదాయకం. నిఘంటు పరిజ్ఞానం, కావ్యదోషాలు, వ్యాకరణ వరివస్య, ఛందస్సౌందర్యం, కావ్యాస్వాదన తదితర శీర్షికలతో వస్తున్న వ్యాసాలన్నీ భాషాజ్ఞానాన్ని పెంపొందిస్తూ సాహితీ ప్రియులకు, ఉపయోగపడతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**– ఎ. రామకృష్ణమూర్తి**




# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

- శతావధాని డా॥ జి.యం. రామశర్మ

**చం.** ప్రకటితరాశుధారను సభాసదులెల్లరు మెచ్చుచుండ, నా
యకమణి సంతసింపగ నయారె రచించినవాడవీవు, వా
రక యరవిందసుందర మరందఝరంబు స్రవించుచుండు నీ
సుకవిత గాచుకోదగవె సుబ్బనశాస్త్రి జగద్ధితంబుగన్

ఈ పద్యము శ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు తన శిష్యుడైన శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిని కొనియాడుతూ చెప్పినది. శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు(1893-1935) గుంటూరుజిల్లా బాపట్ల తాలుకాలోని గార్లపాడు గ్రామవాస్తవ్యులు. శ్రీ అవ్వారి వారు సంస్కృతాంధ్ర భాషలలో కృతభూరిపరిశ్రములై ఉభయ భాషలలోను శతావధానాలు చేసి పండితలోకంలో సుశ్లోకు లైనారు. విశేషించి వివిధ వేదికలపై ఆశుకవిత సభలు నిర్వహించి 'ఆశుకవితిలక' అనే బిరుదాన్ని పొందారు.

శ్రీ తిరుపతివేంకటకవులకు, శ్రీ కొప్పరపుసోదరకవులకు కవితా వివాదము లేర్పడిన సందర్భంలో తిరుపతివేంకటకవులు "ముందు మా శిష్యులను గెలిచి మమ్ము గెల్వు"దని సవాలు విసిరి, శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని ఆశుకవిత్వమునందు పోటీకి పంపారట. అప్పుడు వేమవరాగ్రహారము నందు శ్రీ అవ్వారివారు గంగాప్రవాహసదృశంగా ఆశుకవిత్వాన్ని ప్రదర్శించారట.

సికింద్రాబాదులో చాలా వేదికలపై శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు శతావధానాలను, ఆశుకవితాసభలను నిర్వహించారు. ఒక శతావధానంలో వీరికి ఒక ప్రాశ్నికుడు 'రాత్రౌ రవిం రమ్యతరం దదర్శ' (రాత్రివేళ రమ్యతరుడైన రవిని ఒకడు లేదా ఒకర్తె దర్శించెను) అనే సంస్కృత సమస్యనీయగా వారు దాన్ని శృంగారరసరమ్యంగా ఇలా పూరించారు.

శ్లో॥ కాచిద్వియోగాగ్ని పరీతచిత్తా
చంద్రేణ తీక్ష్ణం పంచాధ్యమాన
భావే విచార్య భ్రమయ సుధాంశౌ
రాత్రౌ రవిం రమ్యతరం దదర్శ

పతివియోగాగ్నిచే మదనవేదన ననుభవిస్తున్న ఒక తరుణీమణి రాత్రియందు చంద్రునిచే బాధింపబడుతూ చాలా విచారించి తన భావమునందు భ్రమచే రమ్యతరుడైన సుధాకరుని యందు భాస్కరుని దర్శించినది.

మదనవేదనలో ఉన్నవారికి చంద్రుని వెన్నెల మరింత వేదన కల్గించడం, శృంగారజ్ఞులకు తెలిసిన విషయమే. ఈ పూరణలో సుధాంశుడు సూర్యుడుగా కావడం చక్కని చమత్కారం. 'యథాస్త్యైరోచతే విశ్వం తథేదం పరివర్తతే' అని కద ఆలంకారిక నిష్కర్ష.

సికింద్రాబాదులో జరిగిన అదే అవధానంలో మరొక ప్రాశ్నికుడు 'పద్మములు ముకుళించెను భాను జూచి' అను సమస్యనీయగా దీన్ని కూడా శృంగారరస నిర్భరంగా ఇలా పూరించారు.

తె.గీ. చాలగ వియోగ తాపప్రభావకలన
రాత్రి గడవగ కృష్ణుని రమణులెల్ల
రలసి, ఆతండు రామిచే, నబలల ముఖ
పద్మములు ముకుళించెను భాను జూచి

ఇక్కడ కవి కల్పనలో పద్మాలు ముఖపద్మాలయినాయి. "అతిశయించిన కృష్ణవియోగతాపముచే రాత్రంతా గడచిపోగా, గోపికలు చాలా అలసిపోయారు. ప్రొద్దు పొడిచినా ఆ నల్లనయ్య రాకపోయేసరికి ఆ గోపికల ముఖపద్మాలు భానుని చూచినప్పటికీ ముడుచుకుపోయాయి" అని హృదయంగమ పూరణ.

శ్రీ అవ్వారివారు దైవబలము, ఆంధ్రధ్వని, తెలుగు కావ్యాదర్శము, ఆంధ్రభాషవిలాపము, జీవన్ముక్తి - విదేహముక్తి, సగుణోపాసన - నిర్గుణోపాసన మొదలైన కృతులను రచించి సాహిత్యరంగాన్ని సంపన్నం చేసారు.

**మనవి**

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

**- సంపాదకులు**

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

**నీటి పుట్టుగు పట్టి యెన్నడు నెమ్మి గానగ లేని య**
**మ్మేటి వేలుపురాయ డా మరుమేపు కందొర మామగా,**
**నేటి నీటుతపంబు సేసెనొ యా వడంకు మలంచు దా**
**మాటికిం గొనియాడుచుం జని మన్నురేడట ముందటున్ –**

16 వ శతాబ్దిలో గోల్కొండ మహా సామ్రాజ్యాధినేత – మల్కిభరాముని (ఇబ్రహీం కులీ కుతుబ్ షా) పాలనలో పారశీక, ఉరుదూ భాషలతో బాటు సంస్కృతం, తెలుగు భాషా సాహిత్యాలు కూడ నవ్య మార్గంలో పరిఢవిల్లాయి. ఆ తరుణంలో వెలువడిన – పొన్నికంటి తెలగన కవి రచించిన "యయాతి చరిత్రము" అన్న మొట్ట మొదటి అచ్చ తెనుగు కృతిలోని పద్య మాధురులను మనం వరుసగా .. గ్రోలుతూ ఉన్నాం. ఆ కృతిలో – ద్వితీయాశ్వాసం లోని 41 వ పద్యం ఇది. దీని కన్న ముందు కొన్ని పద్యాలలో యయాతి మహారాజు, వేటలో రాటుదేలిన యెరుకలతో గూడి అడవిలో వివిధ రకాల వన్య మృగాలను వేటాడుతూ ఉన్న విషయాన్ని కృతికర్త వర్ణించడం పాఠకులకు విదితమే! ఆ వేటలో యయాతి భూపతి ఒక జింకను వేటాడుతూ తన తన సహచరులకు దూరంగా వెళ్ళి, హిమాలయ పర్వతంపై ప్రయాణిస్తూ, ఆ మహోన్నత గిరి మహత్త్వాన్ని గురించి మనస్సులో స్తుతిస్తూ, ముందుకు సాగుతున్న వైనాన్ని ఈ పద్యంలో వర్ణిస్తున్నాడు కావ్యకర్త.




ఇక .. "మత్త కోకిల" ఛందంలో – సుమకోమలసదృశ మృదు పద లాలిత్యంతో సాగిన ఈ పద్యంలోని అచ్చ తెనుగు పదాల పరిమళాలను ముందుగా ఆస్వాదిద్దాం.

నీటి పుట్టుగు = నీట పుట్టినది .. పద్మం

నీటి పుట్టుగు పట్టి = పద్మభవుడు .. అంటే బ్రహ్మదేవుడు.

నెమ్మి గానగ లేని = ప్రేమగా (లేక) నిర్భయంగా చూడజాలని

అమ్మేటి వేలుపు రాయడు = ఆ గొప్ప దేవతల అధిపతి

మరుమేపు కందొర = మన్మథుని మ్రింగివేయగల కన్ను గల ఏలిక (అనగా.. శివుడు)

నీటుతపంబు = చక్కని తపస్సు

వడంకు మల = వణుకు పుట్టించేంత చల్లని పర్వతం (హిమాలయ పర్వతం .. పురాణ పురుషునిగా చెప్పాలంటే హిమవంతుడు)

మాటికిం గొనియాడు = పదే పదే పొగడు

మన్నురేడు = నేల నేలువాడు .. భూపాలుడు .. అనగా ఆ యయాతి రాజు

ఇక ఈ అచ్చ తెనుగు పదాలను గురించి కలిగిన అవగాహనతో ఈ పద్య భావాన్ని అవగతం చేసుకొందాం!

"పద్మ సంభవుడైన బ్రహ్మదేవుడు సైతం ఎన్నడు కూడ సూటిగా .. నిర్భయంగా చూడజాలనట్టి ఆ గొప్ప దేవతల అధినాయకుడు .. ఎవడైతే మన్మథుణ్ణి మ్రింగివేయగల మూడవ కన్ను గల దైవమో .. ఆ రుద్రునికి – మామ కాగలిగిన వణుకు పుట్టించగల చల్లని హిమగిరీంద్రుడు ఎంత చక్కని తపస్సు చేసాడో కదా!" అని మాటిమాటికి ఆ హిమవత్పర్వతాన్ని కీర్తిస్తూ ఆ యయాతి మహారాజు ఆ హిమాచలంపై అటువైపు ఇంకా ముందుకు సాగిపోతున్నాడు... అంటూ ఈ పద్యాన్ని కృతికర్త – రమణీయమైన, ప్రసిద్ధమైన పౌరాణికాం శాలను జోడించిన వర్ణనతో.. హిమగిరిపై కథానాయకుని ప్రయాణాన్ని వివరిస్తున్నాడు.

ఇక్కడ.. ఈ కావ్యకర్త యొక్క వర్ణనా వైదుష్యం, చాతుర్య వైభవం ఇంతటితో అయిపోలేదు. సందర్భాన్ని బట్టి కేవలం పురాణ పురుషుల కథాంశాలను వర్ణనలో మేళవించడం కొద్దిపాటి ప్రతిభ గల ఏ కవి పుంగవుడైనా చేయగలడు. కానీ, తెలగన కవి యోచన – అంతకు మించిన పరిధిలో సాగింది. వైరుధ్య లక్షణాలు, స్థితులలో ఉన్న ఇద్దరు పురాణ పురుషులు మామ, అల్లుళ్ళు ఎట్లా అయ్యారో.. అన్న ఆశ్చర్యాన్ని కథానాయకుడయిన యయాతి ప్రభువు వ్యక్తపరచడంలోనే ఉంది అసలు చమత్కృతి! అల్లుడేమో! – తన మూడవ కన్నుతో మన్మథున్ని మసి చేసిన మహాశివుడు! అదీ .. సకల చరాచర సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు కూడ సూటిగా, ధైర్యంగా చూడలేని ప్రళయ కాల రుద్ర స్వరూపుడు!! ఇక .. మామ అంటారా? – తన దరికి ఎవరు చేరినా .. వణుకు పుట్టించే అంత చల్లదనం కలిగిన హిమశైల స్వరూపుడు. ఈ మంచుకొండ స్వామి, విరుద్ధ లక్షణ స్వరూపుడైన ఆ చిచ్చరకంటిని అల్లునిగా పొందడానికి .. ఎంత గొప్ప తపస్సు చేసాడో! .. అనడం ఒక విశిష్ట నవ్యాభివ్యక్తి! నిజానికి, మన పురాణ గ్రంథాలలో పరమ శివునితో తన పరిణయం కొరకు తపస్సు చేసింది – జగన్మాత

పార్వతీదేవి! విశేషమేమంటే .. కవి వ్రాసిన ఈ నవ్య భావనలో చదువుతున్న పఠితలెంతగా లీనమై పోతారంటే .. ఆ పురాణాంతర్గతంగా ఉన్న అసలు కథను – కాసేపు వారు పూర్తిగా మరచిపోయి, నిజమే కదా! ఆ హిమవంతుడు ఎంత గొప్ప తపస్సు చేసాడో అన్న భావనలోనే లీనమై పోతారు.

ఇక్కడ .. కృతికర్త అన్యాపదేశంగా చెప్పుతున్న మరొక విషయం దాగి ఉంది.

అదేమిటంటే .. నాయకుడు వేటలో భాగంగా అంతవరకు చేసిన ప్రయాణం వేరు. హిమనగం చేరుకొని చేస్తున్న ప్రయాణం వేరు. ఇక్కడకు చేరుకోగానే ఆ యయాతి రాజు చలితో వణికిపోతూ ఉండడం వలన, ఆయనకు – ఆ హిమవన్నగం సోయగం, ఎత్తు, వెడల్పులు కాకుండా, ముందు .. “వడంకు మల” గానే, దాని లక్షణం తోచింది. ఆ వణుకులో తనకు కావలసిన వెచ్చదనాన్ని “మేటి వేలుపు రాయడైన మరుమేపు కందొర” లో వెదుక్కొన్నాడన్న మాట! .. నిజంగా – ఎంత ఉదాత్తమైన, తాత్త్వికమైన భావన! చలి – ఐహిక వ్యథ! పరమేశ్వరునిలోని వెచ్చదనం – పారమార్థిక సాధన లక్ష్యానికి ప్రతీక! ఈ ఐహిక వ్యథ నుండి, కావలసిన పారమార్థిక లక్ష్యాన్ని పొందడానికి కావలసింది – తపస్సు! అందుకే .. చలికి వణుకుతున్న యయాతి విభుడు ఆ శీతనగంతో మమేకమై ఉండడం వలన .. ఆ శీత గిరీంద్రుడే ఆ తపస్సు చేసినట్లుగా భావించాడు .. అన్న రీతిలో “పొన్నికంటి“ కుల తిలకుడు ఈ వర్ణన చేసి ఉంటాడని – ఈ పద్య వ్యాఖ్యాతగా నా భావన! జోహార్ పొన్నికంటి తెలగన మహాకవీ! జోహార్!

# ఇత్త్వసంధి విషయం

## వ్యాకరణ పరివస్య 14

ఎన్.సిహెచ్. చక్రవర్తి

**ఇకాదులకుఁదప్ప ద్రుతప్రకృతములకు సంధి లేదు** (సంధి. 9)

ఇక + ఆదులు = ఇక ఆదిగాగలవి.

అవి ఇక, ఇగ, ఎట్టకేలకు, ఎట్టకేని అనేవి. ఇవి ద్రుత ప్రకృతికాలు. వాటికి తప్ప ఇతర ద్రుతప్రకృతికాలకు అచ్చు పరమైతే సంధి రాదు...అని సూత్రం.

ద్రుతప్రకృతికాలకు సంధి రాలేదంటే ఆ ద్రుతం అలాగే ఉంటుంది. సంధి జరిగితే ద్రుతం లోపిస్తుంది.

దీనిని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. ఈ సూత్రం ప్రకారం పై నాలుగు ద్రుతప్రకృతిక పదాలకు సంధి వికల్పంగా జరుగుతుంది.

ఇక(న్) + ఏమి = సంధి జరిగితే (మధ్యలో ద్రుతం లోపించి) **ఇకేమి.** వికల్పం కనక సంధి రాకుంటే (మధ్యలో ద్రుతం అలాగే ఉంటుంది) **ఇకనేమి.** ఇలాగ రెండు రూపాలు ఏర్పడతాయి.

ఎట్టకేలకు(న్) + అప్పుడు అని ఉండగా...

సంధివస్తే – **ఎట్టకేలకప్పుడు;**

సంధిరాకుంటే – **ఎట్టకేలకునప్పుడు.**

ఈ విధంగా ఇకాదులకు వికల్పసంధి వస్తుంది. మిగతా ద్రుతప్రకృతికాలకు సంధి రాదు. ఉదాహరణలు –

**వచ్చున్ + ఇపుడు =వచ్చునిపుడు;**

**చూడన్ + అయితి = చూడనయితి;**

**ఉండెడిన్ + అతడు = ఉండెడినతడు**

– అనే రూపాలు సిద్ధిస్తాయి. ఈ ఉదాహరణలు బాలవ్యాకర్త చూపిన ఉదాహరణలు.

ఉదాహరణలలో పూర్వ పదాల చివర ఉ, అ, ఇ ఉన్నాయి. చిన్నయ సూరి 9వ సూత్రంలో ఒక వివరణ ఇచ్చారు –

**ప్రథమేతర విభక్తి విధి నిరవకాశంబు గావున దీనిని బాధించెడిని** – అని.

సంధి 2 వ సూత్రం – **ప్రథమేతర విభక్తి శత్రర్థచువర్ణము లందున్న యుకారమునకు సంధి వైకల్పికముగానగు**

ఈ సూత్రంలో – **నన్నున్ + అడిగె; నాకొరకున్ + ఇచ్చె** – మొదలైన చోట్ల ద్రుత ప్రకృతికాలకు వికల్పసంధి వచ్చి **నన్నడిగె; నాకొరకిచ్చె** మొదలగు సంధి వచ్చే రూపాలు ఉన్నాయి.

ప్రస్తుత 9వ సూత్రం ప్రకారం ఇకాదులకు తప్ప ద్రుతప్రకృతికాలకి సంధి రాకూడదు కదా!

9వ సూత్రం వల్ల **నన్నడిగె, నా కొరకిచ్చె** మొదలైన సంధి వచ్చే రూపాలు ఉండరాదు కదా అనే ప్రశ్న వస్తుంది.

అప్పుడు 2వ సూత్రం ప్రయోజనం ఉండదు. అది నిరవకాశం అవుతుంది. నిరవకాశం సావకాశాన్ని బాధిస్తుంది అనగా 2వ సూత్రం 9వ సూత్రాన్ని బాధిస్తుంది.

కనుక **9వ సూత్రంలో చెప్పబడిన ఇకాదులకూ 2 వ సూత్రంలో చూపబడిన ప్రథమేతర విభక్తి శత్రర్థ చువర్ణాలలో ఉన్న ద్రుత ప్రకృతికాలకు తప్ప** ఇంక ఎక్కడా ద్రుతప్రకృతికాలకు సంధి రాదని గ్రహించాలి.

2,9 సూత్రాలలో చెప్పబడిన ద్రుతప్రకృతికాలకు సంధి వికల్పంగా వస్తుంది.

# దుష్కరప్రాసలు - 2

ప్రాసలో అచ్చు ఉన్నప్పుడు ఎలా నిర్వహించాలో మనం తెలుసుకున్నాం. ఏదైనా ఒకే హల్లు ఉంటే అది సుకరప్రాస, రెండు లేదా అంతకన్నా ఎక్కువ హల్లులు అనగా ద్విత్వ, సంయుక్తాక్షరాలతో కూడిన వాటిని దుష్కరప్రాసలుగా పేర్కొంటాము.

ఆత్మ, వజ్ర, కుట్మల మొదలగు పదాలతో పద్యపాదం ప్రారంభమైతే త్మ, జ్ర, ట్మ లతో ప్రాసవేయాలి. అటువంటి పదాలు అవి తప్ప వేరేలేవు. అందువల్ల నాలుగు పాదాల్లో అవే పదాలను వాడుకొనక తప్పదు.

ఆత్మ విషయంలో జీవాత్మ, పరమాత్మ, స్వాత్మ ఇత్యాది పదాలను తయారు చేసుకొనవచ్చును కాని మిగిలిన వాటికి ఆ వెసులుబాటు లేదు. వజ్రము గలవాడు వజ్రి, అనగా ఇంద్రుడు అని అర్థంలో మరొక్క పదాన్ని వాడుకొనవచ్చును. ట్మ ప్రాసకు ఆంగ్లంలోని లిట్మసు, ఫిట్మన్ అన్న పదాలను కొందరు అవధానులు వాడి పూరించి ఉన్నారు. సాధారణంగా అవధానులు ఎన్నుకొనే పద్ధతి ఒకటున్నది.

ఈ 'త్రా' ప్రాసము కష్టమంచు... ఇలా మొదటి పాదం మొదలవుతుంది. త్రా స్థానంలో మరే ప్రాసాక్షరమైనా ఉంచవచ్చు. ఆపద గడవంబెట్టగ... అన్నట్లు ఈ మార్గం ఉపకరిస్తుంది కాని, మిగిలిన పాదాల అర్థ సమన్వయం చూసుకోవాల్సిన బాధ్యత అవధానిపై ఉంటుంది. వావిళ్ళవారు ప్రచురించిన 'తెలుగు సమస్యలు' అన్న పుస్తకంలో ఇలాంటి పూరణ ఉన్నది.

ఈత్రా ప్రాసము చెడ్డదంచు వినమీరెంతేసి వారాడగా
వాత్రాసంబది సత్కవీశ్వరులకున్ వర్ణింప నే జెప్పెదన్
దిక్త్రారాతికి బార్వతీశ్వరులకున్ దిగ్మ ప్రభారాశికిన్
వక్త్రంబుల్ పది, కన్నులైదు, కరముల్ వర్ణింపగా వెయ్యగున్

ఇందులో ప్రాస నిర్వహణ ప్రధానమైనది. మొదటిపాదం సాధారణమైన ప్రణాళికతో ప్రారంభమైంది. రెండు, మూడు పదాలలో ప్రాసకల్పన చాలా గొప్పగా ఉన్నది. వాక్ త్రాసము అనగా వాగ్రూపమైన కష్టము కవీశ్వరులకు ఈ ప్రాసవల్ల లేదని చెప్పడంతో రెండు పాదాలు ముగిశాయి. సమస్యను క్రమాలంకారంతో పూరించాలి.

పది ముఖాలున్న రావణుని ప్రాసలో నిలుపడం కొరకు 'దిక్త్రారాతి' పదకల్పన జరిగినది. దిక్+ త్ర + అరాతి = దిక్పాలకుల శత్రువు. ప్రాసనిర్వహణ, అర్థనిర్వహణ, అలంకార నిర్వహణతో సమస్య చక్కగా పూరించబడింది.

# అంశావలోకనం

శతావధాని ఆముదాలమురళి

ప్రాస దుష్కరమైనదే రెండే మార్గాలున్నాయి. ఒకటి అదే పదాన్ని నాలుగు పాదాల్లోనూ వాడటం, లేదా వ్యాకరణం ద్వారా సాధించుకోవడం. కాదు, కూడదంటే అన్యభాషాపదాలు అందుబాటులో ఉంటే వాడుకోవడం.

ప్రాస నిర్వహణకోసం అవధానులకు ప్రాసాక్షర పదకోశం కొంతవరకు ఉపయుక్తమే కాని అన్నీ ధారణలో ఉండాలి. వంట చేయడం తెలిసిన వాడు రకరకాలుగా, రుచులురుచులుగా వండుకోగలడు. అట్లే అవధానికి ప్రాసను తయారు చేసుకోవడం తెలిసి ఉండాలి.

దానికి పూర్వకవుల ప్రయోగాలు, వ్యాకరణం ఉపయోగ పడతాయి. తార్క్ష్య అన్న ప్రాసను నిర్వహించడానికి వృక్ష, దిదృక్ష, జిఘృక్ష శబ్దములు తద్ధితరూపాలైన వార్క్ష్య, దైదార్క్ష్య, జైఘార్క్ష్య పదాలు ఉపయోగపడతాయి. శ్రీమహావిష్ణువు ధనుస్సు పేరు శార్ఙ్గము. అందువల్ల ఆయనకు శార్ఙ్గి అని పేరు. 'శార్ఙ్గ్యంఘ్రి' అంటే విష్ణుపాదాలని అర్థం. ఈ ప్రాసను సమస్యలో ఇచ్చినప్పుడు భృంగ శబ్దం మీద తద్ధితం చేస్తే 'భార్ఙ్గ' అవుతుంది. ఇలా ఒక పదాన్ని సృష్టించుకోవచ్చును.

జ్యోత్స్న పదం ప్రాసలో ఉంటే తకారంతో అంతమయ్యే చిత్, సత్, భిత్, మృత్ మొదలగు పదాలకు స్నాన, స్నాయు, స్నపన మొదలగు పదాలను కలిపితే ప్రాసను హాయిగా నిర్వహించవచ్చును.

**'మూర్ఖుండొక్కడు రాజుగానయినచో ముల్లోకముల్ వేగవే'** అన్న సమస్యకు సి.వి.సుబ్బన్న శతావధానిగారి పూరణ..

మీర్ఖద్యోతులు మీర్ప్రతాపఖనులున్ మీర్వైభవోదారులున్
మీర్భద్రప్రవిదారితారి జనులున్ మీర్గొప్పవారంచు ద
న్నేర్ఖేలానుతి దేల్చు రట్టిజనులందే నమ్మికన్ బూను నా
మూర్ఖుండొక్కడు రాజుగానచినచో ముల్లోకముల్ వేగవే

ఇందు ప్రాసనిర్వహణ కొరకు మీరు అన్న పదాన్ని మీర్ అని హలంతంగాను, మూడవపాదంలో ఏరు(ఎవరు) అన్న పదాన్ని ఏర్ అని హలంతంగాను ప్రయోగించారు. తెలుగు సంస్కృతాల సంశ్లేష ద్వారా ఈ ప్రాస నిర్వహణ సాధ్యమైంది. అవధాన సారంలో గొడ్రాలు పదానికి ప్రాసలుగా విడ్రాజి, రాడ్రత్నము,

(మిగతా 9వ పేజీలో)

# పద్యపరిమళం

## విశ్వనాథ నైశిత్యం

- అన్నమరాజు ప్రభాకరరావు

**సీ.** ప్రభు మేని పై గాలి వచ్చిన యంతనే
      పాషాణ మొకటికి స్పర్శ వచ్చె,
ప్రభు కాలి సవ్వడి ప్రాంతమైనంతనే
      శిల కొక్కదానికి చెవులు కలిగె,
ప్రభు మేని నెత్తావి పరిమళించిన తోన
      యశ్మంబు ఘ్రాణేంద్రియంబు జేరె,
ప్రభు నీలరత్నతోరణమంజులాంగంబు
      గనవచ్చి రాతికి కనులు కలిగె,
**ఆ.వె.** ఆ ప్రభుండు వచ్చి యాతిథ్యమును స్వీక
రించినంత నుపల హృదయవీథి
నుపనిషద్వితాన మొలికి శ్రీరామభ
ద్రాభిరామమూర్తి యగుచు దోచె శ్రీశ్రీ

భగవానుడైన శ్రీరామచంద్రమూర్తి యొక్క శరీరము ఆశ్రమ ప్రాంగణములోనికి ప్రవేశించగనే అచ్చట వీచుచున్న గాలి ఆయన శరీరమును తాకి ఒక రాతిని తాకగనే దానికి "స్పర్శ" తెలిసినది, ఆయన పాదముల సవ్వడి సమీపించగనే దానికి "శబ్దము" తెలిసినది, ఆయన శరీర సహజసౌరభములు సోకగనే దానికి "ఘ్రాణము" తెలిసినది, ఆ దివ్య నీల శరీర వైభవమును చూడగనే దానికి "రూపము" తెలిసినది, ఆయన ఆతిథ్యము స్వీకరించగనే మిగిలినదానిని ప్రసాదముగా గ్రహించి ఉంటారు కనుక "రసము" తెలిసే ఉంటుంది. ఈ విధముగా పంచ భూతములకు చెందిన పంచ తన్మాత్రలను గ్రహించగల శక్తిని ఆ ఉపల (రూపిణియైన అహల్య) పొంది శాపార్థ విముక్తయైనది. శాపములోని మిగిలిన భాగము – ఆమె వాల్మీకి ప్రకారము లోభ మోహ వివర్జిత యగుట. కానీ బ్రహ్మదేవుని ప్రత్యేక సృష్టి యైన అహల్యకు లోభ మోహములు విశ్వనాథ వారు భరించలేరు. కనుక ఆమెలో శాప వశాత్తు ఘనీభవించిన ఉపనిషద్ జ్ఞానము కరిగి హృదయ వీథుల్లో ప్రవహించుట. అదే జరిగినది.

అంతే కాక, శ్రీరాముడు మర్యాదా పురుషోత్తముడు. ఆయనకు ఋషిపత్నిని గౌరవించుట తెలియును. మొదటినుండి వశిష్ఠుని శిక్షణలో ఇంద్రియనిగ్రహమును సాధన చేసిన నియమ గరిష్ఠుడు. పొరపాటున కూడా ఆయన పాదము కానీ, తద్రజో లేశము కానీ అహల్యను తాకదు. విశ్వనాథ వారు తాకనీయరు.

భర్తయైన గౌతమ మహర్షిచే శప్తయైన అహల్యాదేవి మనము నాటకములలో ప్రబంధములలో చూచినట్లుగా సాధారణ స్త్రీ కాదు. పరమ పతివ్రతా శిరోమణి. పంచకన్యలలో ప్రథమ గణ్య (అహల్యా ద్రౌపదీ కుంతీ తారా మండోదరీ తథా పంచకన్యాః స్మరేన్నిత్యం మహాపాతక నాశనమ్ అనునది పురాణోక్తి – కుంతీ అను చోట సీతా అని పఠాంతరముంది). "ప్రయత్నాన్నిర్మితాం ధాత్రా మాయామయీ (మివ)" (బాల 49 – 14) అనగా చతుర్ముఖ బ్రహ్మచే ప్రత్యేకముగా సృష్టించబడిన శారీరక, మానసిక వైశిష్ట్యము గల స్త్రీ. ఆ విధముగా సృష్టించబడి గౌతమ మహర్షి సేవలకై నియమింపబడింది. ముందునుంచే ఆమెను వాంఛించిన ఇంద్రుడు ఆమెను పొందగోరి కృత్రిమ బ్రాహ్మీకాలాన్ని సృష్టించి గౌతముడు ఆశ్రమము వీడగానే అక్కడికి వచ్చినాడు. అహల్య తన తపశ్శక్తిచే ఆ వచ్చినవాడు ఇంద్రుడని గ్రహించి, హెచ్చరించి పంపివేసింది. ఆతడు ఆశ్రమమును వీడక ముందే, తీర్థజల స్నానమాచరించి వచ్చిన గౌతముడు ఇంద్రుని గుర్తించి శపించినాడు. అప్పుడే అహల్యను కూడా "అన్నపానీయములు లేక వాయుభక్షణముతో ఈ ఆశ్రమము నందే భస్మశాయివై తపించుచు, ఎవ్వరినీ కనిపించకుండా పడియుండు"మని శపించాడు. శాప విమోచనముగా

"యదాచైతద్వనమ్ ఘోరం రామో దశరథాత్మజః ।
ఆగమిష్యతి దుర్ధర్షః తదా పూతా భవిష్యసి" ॥

(బాల. 48-31)

"తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభ మోహ వివర్జితా ।
మత్సకాశే ముదా యుక్తాస్వం వపుర్ధారయిష్యసి" ॥

(బాల. 48-32)

"భవిష్యత్తులో దశరాత్మజుడైన శ్రీరామచంద్రుడు ఈ ఘోరారణ్యానికి వచ్చినప్పుడు నీవు పవిత్రురాలవగుదువు. ఆయనకు అతిథి సత్కారాలు నెఱపిన తరువాత నీకు లోభమోహములు తొలగి నిజరూపము సిద్ధించి నన్ను చేరెదవు గాక" అని తెలిపినాడు.

శాపవిమోచన క్రమాన్ని వాల్మీకి

"త్రయాణా మపి లోకానాం యావద్రామాస్య దర్శనం
శాపస్యాంత ముపాగమ్య తేషాం దర్శన మాగతా ॥

(బాల 49 – 16)

అప్పటివరకు గౌతమ శాప ప్రభావముచే ముల్లోకములు

(మిగతా 15వ పేజీలో)

# విశిష్ట తెలుగు భాషా వైభవం
## 14 ఛందః ప్రాముఖ్యం




- డా. సంగనభట్ల నరసయ్య

### ఛందో నిరుక్తి

ఛందస్సంటే ఏమిటి? అనే ప్రశ్నకు గురు లఘు గణ యతి ప్రాసాది నియమబద్ధమైన రచనమని స్థూలంగా చెప్పినా, ఈ శబ్దానికి అనేకార్థాలు, అనేక నిర్వచనాలు మన పూర్వులు నిర్ణయించారు. వీటిలో కొన్ని అతిగహనములు, అతి విస్తృతములు, అతి సూక్ష్మములై ఉన్నాయి.

నిజానికి వేదానికి అంగములైనవి వేదం తరువాతే ఆవిర్భవించినా, ఛందస్సు మాత్రం వేదం కంటె ముందే ఆవిర్భవించింది. ఆవిర్భవించిన ఆ గాన ఫణితి (గేయ విధానం)లోనే వేదం ఋషులచే ప్రోక్తం అయింది.

ప్రపంచంలోనే మానవ నిర్మితమైన అతిప్రాచీన వాఙ్మయం వేదం. వేదాల్లో అతిప్రాచీనం ఋగ్వేదం. ఋగ్వేదంలో అతి ప్రాచీనమైన ప్రథమ మండలంలోని ప్రథమ ఋక్కు అయిన అగ్ని మీళే పురోహితం "గాయత్రీ ఛందం"లో మధుచ్ఛందుడు ఆవిష్కరించాడు. అంటే ఆ పాదే విధానం "అగ్నిమిళే" ఆవిర్భావాని కంటే ముందే ఉందనిగదా అర్థం. మూడు పాదాల ఆ గాయత్రి లౌకిక వాఙ్మయంలో 4 పాదాల ఎనిమిది అక్షరాల శ్లోకం ఐంది. ఈ శ్లోకం వాల్మీకి నోట వచ్చింది. సాహిత్యంలో అతి ప్రాచీనం రామాయణం ఆదికవి వాల్మీకి నోట తొలి శ్లోకం "మానిషాద..." కనుక శ్లోకం(అనుష్టుప్) కూడా గాయత్రి వేదానికి వలె, సాహిత్యానికి ఆద్యం.

వైదిక ఛందస్సులను ఎవరు తొలుత సృష్టించారు? అంటే ఈ నడకలు ఎవరు కనిపెట్టారా? ఛందః ప్రభవమును గూర్చి "ఇంద్రా చ్ఛందః..." అని ఇంద్రుడు పాడినట్లు శ్రుతి. దీని నుండి అన్నం, నామం, రూపం పుట్టాయని ఏకం ఛందః బహుధా చాక శీతి" అని వివరణతో ఛందస్సంటే మనం అనుకునే "ఉచ్చారణ కాలపు కొలతలు"గాక సృష్టి, విశ్వ స్థితి అనే భావన కలుగుతోంది. అంటే "ఛందోభ్య ఏవ ప్రథమం ఏతద్విశ్వం వ్యవర్తత" అని వాక్యపదీయం నిర్వచించింది. ఇవి తరువాతి భావనలు.

"దేవావై మృత్యోః బిభ్యతః త్రయీం విద్యాం ప్రాపశన్ తే ఛందోభిః ఆచ్ఛాదయన్" అని ఛందోగ్యోపనిషత్తు వివరించింది. దేవతలు మృత్యువు వలన భయపడి త్రయీ విద్యను ప్రవేశించి ఛందంతో తమను ఆచ్ఛాదించుకొన్నారని. మృత్యుభీరులకు ఛందస్సు ఆచ్ఛాదనమైందని. అంటే వేదం గానం చేస్తూ భీతిని జయించారని సామూహిక గానంలో తమను తాము మరచి, మృత్యుభీతిని మనస్సులో నుండి తొలగించుకొన్నారని.

ఛందస్సు అంటే వేదమని ప్రాచీనకాలంలో వ్యవహారం. ఛాందసుడంటే నిరంతర వేదపఠిత అని అర్థాలున్నాయి.

విశ్వం భగవదధీనం, భగవత్స్వరూపం మంత్రాధీనం, మంత్రం ఛందోऽధీనం, కనుక ఛందస్సు సృష్టి కారకమని భావాలున్నాయి. విశ్వం గానయోగ్యం అంటే గేయములో విశ్వం వర్ణ్యం. గేయంచేత విశ్వం ఆచ్ఛాదితం. గేయం ఛందోऽచ్ఛాదితం. ఛందాంసి ఛాదనాత్"(నిరుక్తం 7-12) అనే మరో నిర్వచనం దీని నుంచి పుట్టింది.

వేదములు గానమయం. "గాయతి, త్రాయతీతి గాయత్రీ" అని తొలి ఛందానికి నిరుక్తి. వేదాలు సృష్టిని ఆచ్ఛాదిస్తాయి. లేదా భగవత్స్వరూపాన్ని శబ్దాచ్ఛాదనం చేస్తాయని ఒక మార్మిక భావన. "ఆచ్ఛాదకత్వాత్ ఛందః"(సాయణుడు-ఋగ్వేదభాష్య భూమిక).

ఛందమనగా పాట. తొలిమానవుని ప్రకృతి పరిశీలనా ప్రేరిత కవితావిర్భావాద్భుత చిత్తప్రవృత్తికి ప్రేరకా రూపమైన గానము ఛందోమయము. "ఆవరింపబడలేని ఓ దైవమా! నీవు నా ఛందము(ఇచ్ఛ)చే ఆవరింపబడుచున్నావు. నా పాటచే వర్ణింపబడుచున్నావు. నా పాటను గ్రహింపుము. పాటలోని అర్థముతో నా ఇచ్ఛను(ఛందమును) గ్రహింపుము. లేనిచో ఈ గానము వ్యర్థమ"ని తొలి మానవుని సంవేదన. "న వాచం విజజ్ఞా సీత, వక్తారం విద్యాత్" అనగా వాక్యార్థం తెలిసినంత మాత్రాన సరిపోదు. వక్త హృదయము తెలియవలెను. వాక్యము కంటే వక్త ముఖ్యము. వక్త చిత్త వృత్తి తెలిసినపుడే వాక్యము తెలిసినట్లు అని శంకరభగవత్పాదులు మీమాంసా సూత్ర భాష్యమును వివరించినాడు. వక్త హృదయము ఛందస్సు (గానము) వలన తెలియదగును.

లభ్యమాన విశ్వమానవ బుద్ధి వికాస పరిణామములో ప్రప్రథమైన భావన(అగ్నిమీళే పురోహితం) గాయత్ర్యధీనం.

బుద్ధితెలిసినది మొదలు మానవునికి ప్రకృతి మొదటి విచిత్రము. పంచభూతములు మానవుని బుద్ధికి అందని విశ్వబ్రహ్మ విచిత్రాలు. అందుకే అగ్నిని చూసి ఆశ్చర్యపడిన తొలి మానవ గేయం ఈ ఛందం. భీతుడైన మానవుడు తన భయాన్ని ఛందస్సుతో ఆచ్ఛాదించుకొన్నాడు. "అగ్నేర్గాయత్ర్యభవత్" (ఋక్ 10-130) అనగా అగ్ని నుండి గాయత్రి పుట్టెను. నిజమే! సృష్టి విచిత్రముల నుండి పాట పుట్టుచున్నది. ఇచ్చట అగ్ని సందర్శనము వలన గాయత్రి పుట్టినది భయదము, గాన ప్రేరకములు ఐన అగ్న సందర్శనము నుండే మధుచ్ఛందునకు, మధురమైన ఛందమును ఆవిష్కరించిన మానవునకు ఛందము గోచరమైనది. ప్రకృతి పరిశీలనలో మానవుడు ఆనందాశ్చర్యభయద సౌందర్యానికి ప్రేరితుడై గాయత్రి పాడుకొన్నాడు. "గాయ గాయత్రీం ఉక్థం" అనగా గాయత్రిని ఉక్థమైన దానిని పాడుమనుచున్నాడు. మనో వికారమును పొందిన తన యవస్థను వెల్రగక్కుటకై, మనోభారమును దించివేసికొన్నాడు. వాల్మీకిది ఇదే అవస్థ. పద్యం పూర్తి ఐనాక అందరు కవులది ఇదే అవస్థ. అపుడు పుట్టేది ఆహ్లాదం "ఛందయతి ఆహ్లాదయతీతి ఛందః" అని అమరకోశ నిర్వచనము. "గాయత్రేణ ఛందసా త్వా ఛాదయామి, త్రైష్టుభేన ఛందసా త్వా ఛాదయామి" అని పింగళ ఛ్ఛందశ్శాస్త్ర భూమిక. శోకము నుండి ఆహ్లాదమునకు మహర్షి ఆదికవి హృదయము పరివర్తనమైనది. ఈ సంఘటనను ఛందో విశిష్టతను భవభూతి విశేషముగా తన 'ఉత్తర రామచరితం' విశదీకరించినాడు. అది తొలి భావనకు తొడిగిన తొలి ఆచ్ఛాదన.

శ్లో. **గాయత్రం ఛందసాం పూర్వం వర్ధమానాక్షరం పరం**
**వాఙ్మండనకరం నౌమి చిత్తవృత్తి ప్రసిద్ధయే** - అని జయదేవోవాచ.

భగవంతునకు ప్రతికృతి యైన ప్రకృతి దర్శన, మనన, వివేచనాదులచే మానవుడు పులకించినాడు. ఆ దైవదర్శనమునకు వలయు చిత్తవృత్తిని పరిణతమొనర్చుటకు స్తోత్రము కావలయును. వాఙ్మండన ప్రాయమైన పాట కావలయును.

సూర్యభగవానుని ఉదయ బింబదర్శనముతో ప్రారంభమైన సంధ్యావందనములో

"గాయత్రీం ఆవాహయామి, సావిత్రీం ఆవాహయామి, ఛందర్షీం ఆవాహయామి" అని అక్కడ ఛందమును పాడిన ఋషిని ఆవహింపచేసికొనుటకు ఎందులకో తెలియుచున్నది.

అట్టి చిత్తవృత్తి నుండి అస్తవ్యస్తము చంచలము కానట్టి రూపమున క్రమబద్ధమైన పాటపుట్టినది. ఈ క్రమరూపమే ఛందము. ఛందము లయ రూపము. లయ ఋత(Rhythm) స్వరూపము. ఋత మన భగవంతుడే. ఋతం వచ్మి. సత్యం వచ్మి.

(6వ పేజీ తరువాయి)

## అంశావలోకనం - దుష్కరప్రాసలు - 2

సమ్రాడ్జీత్ని అని వాడారు. విట్+రాజి = జనసమూహము, రాట్+రత్నము = రాజశ్రేష్ఠుడు, సమ్రాట్+రీతి = చక్రవర్తివలే - ఈ పదాలులోని 'ట' జస్త్వసంధి కారణంగా డ గా మారింది. ఇలా వ్యాకరణంతో ప్రాస పదాలను సమకూర్చుకోవాలి.

దుఃఖము అన్న పదం ప్రాసలో ఉన్నప్పుడు శ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రిగారు చేసిన పూరణ ఇలా ఉన్నది..

**గీఃఖననంబులేల? పరికించి వచించెద నొక్కమాట 'జా**
**రాఃఖలు పాపినో'యని తిరంబుగ పల్కెడి ఛాందసోక్తులున్**
**భాఃఖచితోక్తులన్ బలె మనంబున నెంచకుడీ నిరస్త ధీ**
**దుఃఖము గాదె చక్కటి వధూటి రతంబు విదగ్ధ కోటికిన్**

ఇక్కడ సకారాంత పదాల సకారమునకు క,ఖ,ప,ఫ వర్ణములు పరమగునపుడు సకారమునకు బదులు విసర్గ ఆదేశంగా వస్తుంది. (జిహ్వామూలీయ, ఉపధ్మానీయ) అన్న సూత్రం అక్కరకు వస్తుంది. మనఃఖేదము, కృషీవలఃఖనతి, తపఃఫలం, మనఃకమలము, పయఃపానము మొదలగు పదాలు ఏర్పడతాయి. అయితే అవ్యయము కాని సకారాంత పదం యొక్క సకారానికి పాశ, కల్ప, క, కామ్య ప్రత్యయాలు పరమగునప్పుడు విసర్గము రాదని గుర్తుంచుకోవాలి.

యశస్కల్పము, యశస్కుడు, పయస్పాశము మొదలగు రూపాలుంటాయి. అవ్యయ సకారానికి మాత్రం విసర్గవస్తుంది అనడానికి ప్రాతఃకల్పము ఉదాహరణ కాగా అవ్యయమైనా విసర్గ రాదనడానికి సద్యస్కము ఉదాహరణ. అనగా వ్యాకరణ సాధ్యము లైన పదాలతో ప్రాసను నిర్వహించునప్పుడు మినహాయింపులను కూడా గుర్తుంచుకోవాలి. ధనుష్ఖండము ఇట్టిదే. గీర్, ధూర్ శబ్దములకు పది, పుత్ర శబ్దములు పరమైతే వికల్పంగా విసర్గ వస్తుంది. గీఃపతి, గీర్పతి అన్న రూపాలు వస్తాయి. గీష్పతి అని కూడా వ్యవహారం ఉన్నది. నిష్ఖేద అన్న పదానికి నిఃఖేద అని రూపాంతరం ఉన్నట్లు కుమార వ్యాకరణం పేర్కొన్నది. ఈ వ్యాకరణ విశేషాలను దృష్టిలో ఉంచుకొని దుఃఖము అన్న పదానికి ప్రాసలను తయారు చేసుకోవాలి.

## అహోబిలమఠం నిర్వహణలో డి.డి. కాలనీ నరసింహ స్వామి ఆలయంలో జరిగిన

## నల్లాన్ చక్రవర్తుల సాహిత్ గారి అష్టావధానం 26-09-2026

**అధ్యక్షులు:** డా. శ్రీపెరుంబుదూర్ శ్రీరంగాచార్య

**సంచాలకులు:** శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ

**నిషిద్ధాక్షరి:** డా. ఆచార్య ఫణీంద్ర

**అంశం:** నరసింహోద్భవం

(–) శ్రీ(న)మ(త)ద్ధ(ర)న్యున్ (–)గా(న)వన్ (భ)దాఁమ(మ)ర్త్య(స)తఁ(త)బ(ల)ంచ( ద)వ(శ)క్ర(–)తన్( బ)గ(ల)ంబ(ము)ంబున్.....

కం. శ్రీమద్ధన్యున్ గావన్
దామర్త్యత బంచ వక్రతన్ – గంబంబున్,
వ్యోమముఁ బ్రద్దలు జేయుచు
సామాద్యామ్నాయనుతుడు జననము నొందెన్!!

**సమస్య:** డా. వేదాల గాయత్రీ దేవి

**తింత్రిణీ తరుకోటరమ్మున తేజరిల్లెను మౌనియై**

మ.కో. మంత్ర రాశిని పాశురమ్ముల మానవాళికి నీయగా
అంత్ర మాలలుదాల్చి వాని కటాక్షమొందిన వానిగా
తంత్రమున్ వకుళాభిరాముడు తత్త్వ బోధను నిల్పగా
తింత్రిణీ తరు కోటరమ్మున తేజరిల్లెను మౌనియై!!

**దత్తపది:** అష్టకాల విద్యాచరణ్

**అంశం:** దివ్య– భవ్య – నవ్య – సవ్య– పదములతో స్వేచ్ఛా వృత్తంలో భగవద్గీతలోని భక్తియోగం

ఉ: **దివ్య**త నెల్ల భూతముల దేవుని యందున భూతరాశినిన్
**నవ్య**తరోత్సుకత్త్వము మనంబును దాల్చుచు చూచువాడు, తా




శ్రావ్యము లాలకించి యప**సవ్య** పథమ్ముల త్రొక్క కున్నచో
**భవ్య** మురారి ధామమును ప్రాప్తిగ పొందును భక్తి యుక్తుడై!!

**వర్ణన:** ఆరవల్లి శ్రీదేవి

**అంశం:** నారాయణ మంత్రోపాసకుడైన ప్రహ్లాదునికి నరసింహ రూపంలో స్వామి ఎందుకు కటాక్షించాడు మత్తేభంలో

మ. హరి నారాయణ మంత్ర చిత్తుడగు ప్రహ్లాదున్ కటాక్షింప, స
త్వరుడై మానవ సింహ రూపమున స్తంభంబందు జన్మించె, తా
నరభాగమ్మున జీవునిన్ దెలుపుచున్, దైవమ్ము శీర్షంబునం
దరిగెన్ భక్తజన ప్రదీప్తమగు మంత్రార్థ స్వరూపంబుగా!!

**న్యస్తాక్షరి:** మాడుగుల నాగ గురునాథశర్మ

**అంశం:** హయగ్రీవ స్తుతి

**జ్ఞా–నా–నం–ద అక్షరములను 1-6-14-7 స్థానములలో వరుసగా 4 పాదములలో వుంచుతూ శార్దూలంలో**

శా. జ్ఞానానందమయ స్వరూపుడు రమా సంరూఢ వామాంకుడున్,
నానా వాగ్రచనా ప్రదాయకుడు మందస్మేర సంభాసుడున్,
ధ్యానంబందున నిల్చి సత్త్వగుణసంధానంబు కల్గించు, నా
శ్రీనారాయణవేదమూర్తిని హయగ్రీవున్ ప్రశంసించెదన్!!

**ఆశువు:** శ్రీమతి మంకాల లక్ష్మీ మానస

**అంశం:** 1. అన్నమయ్య 32 అక్షరాల సంకీర్తన, నరసింహ క్షేత్రాలపై, వారికి నరసింహస్వామిపై కల భక్తి



తే.గీ. తీక్ష్ణ దంష్ట్రల నరసింహ దివ్యమూర్తి
మోహనంబుగ నెవ్వాని యూహ మెఱసె
చేరె నరసింహునన్నారసింహమయుడు
ఆంధ్రపదకవితా త్రాత అన్నమయుడు

**2. తపనేందు అగ్ని నయనుడు, అందమైన నారసింహుడు (కామాసికాష్టకం)**

కం. తన శ్రితులకు శశి నయనము
తన రిపులకు తపన నయన దర్పము చూపన్
ఘన కర్మము దహియింపగ
అనలము తన కనుల గలుగు హరిని నుతింతున్

**ఛందోభాషణము: సరస్వతీ రామశర్మ గారు**

(ప్రా) ప్రాభవ మొప్పగా గరికిపాటియె యెట్లు వరించె మిమ్ములన్?
(అ) శోభనమైన పద్యముల చూచివచించిరి యాశిషమ్ములన్
(ప్రా) వైభవమై వెలుంగవలె వర్ధిలగాను వసుంధరన్ సదా
(అ) నేభరియింత నిత్యమును నెప్పుడు శీర్షమునందు మాతరో!!

**అప్రస్తుత ప్రసంగము: సురభి శంకర శర్మ**

## శ్రీ నారాయణీ అవధానవేదిక నిర్వహణలో డా॥ తాతా సందీప్‌శర్మగారి అష్టావధానం

**వేదిక: ఆనంద్‌బాగ్ కమ్యూనిటిహాల్, హైదరాబాద్ 02.10.2026**

**సంచాలకులు: నారుమంచి అనంతకృష్ణ**

**నిషిద్ధాక్షరి: డా. వేదాల గాయత్రీదేవి**

**అంశం: లాల్‌బహదూర్‌శాస్త్రి వ్యక్తిత్వం**

(శ) ఆ (త)శా(ప)స్త్రి(మ)యె(ఘ)తా(చ)ని(ధ)ంపెన్ (ధ)రాశి(గ)ని(స)యూ(ప)నే(ర)ల(ప)కున్(వ)స్థిర(త)ంబౌ(స)న(ల)గ(య)వున్.....

కం. ఆ శాస్త్రియె తా నింపెన్
రాశిని యీ నేలకున్ స్థిరంబౌ నగవున్
దేశ ప్రధానమంత్రిగ
ప్రాశస్త్యము పొందె లాలు బహదూరు డిలన్

**సమస్య: పి.ఎల్. నాగేశ్వరరావు**

**వేళాపాళయె లేదు నీకు మగడ వృద్ధాప్యమందేలనో**

శా. నాలీకమ్ములు నిద్రవోయినను సంధ్యాకాల మేతెంచినన్
వ్యాళంబుల్ రవి శీతభానుల శిరోభాగంబులన్ బట్టినన్
తాలింపుల్ వలె పంచభక్ష్యముల సంధానింప నీకెప్పుడున్
వేళాపాళయె లేదు నీకు మగడ వృద్ధాప్యమందేలనో



**దత్తపది: మాల్యాల సోమేశ్వరరావు**

**అంశం: వాణి-రాణి-వీణ-బాణి పదాలతో సరస్వతి బాల వినాయకుణ్ణి తన ఒడిలో ఆడిస్తున్న దృశ్యం**

మ.కో: ఆ వినాయకు నల్వరాణియె అంకమందున జేర్చుచున్
శ్రీవిధమ్ముగ నక్షరమ్ముల లిప్పులిచ్చి ప్రవీణతన్
ధీవిశాలత కీరవాణిగ తీర్చి రాగము నింపుచున్
పూవుబోణిగ భారతమ్మును పూర్తిచేయగ బ్రోచుతన్

**వర్ణన: డా. భోగయగారి చంద్రశేఖరశర్మ**

**అంశం: గోమాత విశిష్టత**

మ. శ్రీమంతంబగు పృచ్ఛభాగమది లక్ష్మీవాసమై యొప్పగన్
ఆ మూపున్గని మ్రొక్కినంతట మహాఘౌఘంబులే...
గోమాతన్ భజియించి కృష్ణుడెలమిన్ గోవిందుడయ్యెన్ గదా
సామాన్యుండగు మానవుండు కొలువన్ శంకించు తానేలకో

**వ్యస్తాక్షరి: మంకాల లక్ష్మీమానస**

**అంశం: ప్రణమత గోవిందమ్ పరమానందమ్**

**ఆశువు: డా. తులసి వేంకట రమణాచార్యులు**

**అంశం: 1. బతుకమ్మ ప్రకృతి సౌరభం**

కం. తంగేటిపూలు మొదలుగ
సింగారముగా రచించి సిరుల సరులనే
మంగళముగ పూజింప తె
లంగాణము సర్వశుభములన్ బొందునికన్

**2. బాలాత్రిపురసుందరి సౌందర్యము**

కం. బాలాంబకు లీలాంబక
శీలాంబకు సర్వవిశ్వ శివకర సుశ్రీ
కాలాంబకు ముగురమ్మల
మూలాంబకు కరముమొడ్చి మ్రొక్కెద నిపుడున్

(మిగతా 20వ పేజీలో)

# యతిప్రాసవివేచనము - 4

- చిటితోటి విజయకుమార్




## స్వరప్రధాన యతులు

**1. సవర్ణదీర్ఘ సంధి**

సూత్రము: అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణములైన అచ్చులు పరమైనప్పుడు వాటి దీర్ఘము ఏకాదేశమవుతుంది.

ఇటువంటి సందర్భాలలో, హల్లుకు పరంగా ఉన్న అచ్చుతోనే యతి మైత్రి కూర్చాలి తప్ప, హల్లుతో కాదు.

**ఉదాహరణ 1:**

"అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె.."

(పారిజాతాపహరణము 1-82)

ఇక్కడ 'అనవిని' లోని మొదటి అక్షరమైన 'అ' కారమునకు, ఉరగ + అంగన = 'యురగాంగన' లోని 'అ' కారంతో యతి చెల్లుతుంది.

'యురగాంగన' లో 'గ'కారం ఉన్నది కదా అని ఆదివర్ణంగా క, ఖ, గ, ఘ లను ఉంచకూడదు.

అశాస్త్రీయ ప్రయోగము: "రాధికా హృదయేశ! మురారి రమ్ము"

ఇక్కడ 'రాధికా' లోని 'రా' కు, ముర + అరి = 'మురారి' లోని 'రా' (రకారం) తో యతి చెల్లదు.

**ఉదాహరణ 2:**

"ఈ క్షణమందె నిన్ను జగతీశ్వర" (కల్పితము)

పాదాదిలోని 'ఈ' కి, జగతి + ఈశ్వర = 'జగతీశ్వర' లోని 'ఈ' తో యతి చెల్లుతుంది.

**ఉదాహరణ 3:**

"ఉర్వి జనులకు నిదియె మధూదయంబు" (కల్పితము)

పాదాదిలోని 'ఉ' కి, మధు + ఉదయంబు = 'మధూదయంబు' లోని 'ఉ' తో యతి చెల్లుతుంది.

(మిగిలిన అచ్చులకు కూడా ఇట్లే గ్రహించవలెను).

**2. పూర్వరూప సంధి**

ఇది కూడా ఏకాదేశ సంధియే. ఏ, ఓ లకు హ్రస్వ అకారం పరమైనప్పుడు పూర్వరూపము ఏకాదేశమవుతుంది (అనగా పూర్వస్వరమే మిగులుతుంది).

**ఉదాహరణ:**

"ఆద్యబీజాయ విశ్వకర్త్రేఽక్షరాయ"

(ఉత్తరహరివంశము 2-219)

విశ్వకర్త్రే + అక్షరాయ = విశ్వకర్త్రేఽక్షరాయ.

ఇక్కడ పాదం మొదట్లో ఉన్న 'ఆ' కి, 'అక్షరాయ'లోని 'అ' కారంతో యతి చెల్లింది.

**3. యణాదేశ సంధి**

సూత్రము: ఇ, ఉ, ఋ, లకు అసవర్ణములైన అచ్చులు పరమైనప్పుడు క్రమంగా య్, వ్, ర్, ల్ లు ఆదేశమవుతాయి.

ఇందు పూర్వస్వరము మారుతుంది కానీ, పరస్వరము మారదు. కనుక పరంగా ఉన్న అచ్చుతోనే యతి చెల్లుతుంది.

**ఉదాహరణ 1:**

"ఆ మాతామహురాకమున్నె విని భ్రాత్రన్వీతుడై..."

(ఉత్తరరామచరితము 2-213)

పాదం మొదట్లోని 'ఆ' తో, భ్రాతృ + అన్వీతుడై లోని పరపద మొదటి అక్షరమైన 'అ' కారంతో యతి చెల్లింది.

**యణాదేశంలో ప్రత్యేకాంశం:**

యణాదేశం వచ్చిన హల్లుకు సంబంధిత హల్లుతో కూడా యతి చేయవచ్చు.

**ఉదాహరణ 2:**

"స్వస్తి జగత్త్రయీ భువన శాసన కర్తకు"

(శ్రీమదాంధ్ర భాగవతము 8-545)

సు + అస్తి = స్వస్తి. పూర్వవర్ణమైన 'స'కారం + పరవర్ణమైన 'అ'కారం కలిస్తే 'స' అవుతుంది. దీనికి స, సా, సై, సౌ, శా, శై మొదలైన అక్షరాలతో యతి చెల్లుతుంది.

పై ఉదాహరణలో 'స్వస్తి' లోని 'స' కారానికి, 'శాసన' లోని 'శా' తో యతి చెల్లింది.

హల్, విసర్గ సంధులలో స్వరప్రధాన యతి

**1. జశ్త్వ సంధి**

పదం చివర ఉన్న పరుషాలకు అచ్చులు పరమైనప్పుడు సరళాలుగా మారతాయి. ఈ సంధిలో పాదం మొదట్లో ఉన్న అచ్చుకు, సరళంగా మారిన హల్లు తర్వాత ఉన్న అచ్చుతోనే యతి చెల్లుతుంది.

**ఉదాహరణ:**

"ఈ రఘురామమూర్తి జగదేక.." (కల్పితము)

పాదం మొదట్లోని 'ఈ' కి, జగత్ + ఏక = జగదేక లోని 'ఏ' తో యతి చెల్లింది.

అంతేకానీ, 'జగదేక' లో 'దే' అనే అక్షరం ఉంది కదా అని 'దినకర', 'దేవ' మొదలైన పదాలతో పాదాన్ని ప్రారంభించ కూడదు.

**2. అవ ఆదేశము**

'గో' శబ్దమునకు అచ్చు పరమైతే 'గో' లోని ఓకారానికి 'అవ' (అవ) ఆదేశమవుతుంది.

(ఉదా: గో + అశ్వ = గవ + అశ్వ = గవాశ్వ)

**ఉదాహరణ:**

"అతులితరత్నకాంచన గవాశ్వ విభూషణ.."

(శ్రీమదాంధ్ర మహాభారతము – ఆశ్రమవాస పర్వము 1-135)

ఇక్కడ పాదాదిలోని 'అ' కారానికి, గో + అశ్వ లోని 'అ' కారంతో యతి చెల్లింది.

**3. విసర్గ సంధి**

**ఉదాహరణ:**

"ఆశీః ఫలమొక్కొ యాయురైశ్వర్యంబులే" (కల్పితము)

ఆయుః + ఐశ్వర్యంబులే = ఆయురైశ్వర్యంబులే.

ఇక్కడ 'ఆశీః' లోని 'ఆ' కి, 'ఐశ్వర్యంబులే' లోని 'ఐ' తో యతి చెల్లింది.

తెలుగు సంధులలో స్వరప్రధాన యతిపాదాదిలోని అచ్చుతో సంధిగతమైన పరపదంలోని మొదటి అక్షరంతో (అచ్చుతో) యతి చెల్లుతుంది.

**1. అత్వ సంధి**

సూత్రము: అత్తునకు అచ్చు పరమైనప్పుడు సంధి బహుళంగా వస్తుంది.

**ఉదాహరణ:**

"అధిప ధర్మజుపాలనున్నప్పుడతని" (తేటగీతి)

పాలనున్న + అప్పుడు = పాలనున్నప్పుడు.

పాదాదిలోని 'అ' కారానికి, 'అప్పుడు'లోని 'అ' కారంతో యతి చెల్లింది.

**2. ఇత్వ సంధి**

సూత్రము: క్వార్థంబైన ఇత్తునకు సంధి వైకల్పికముగా వస్తుంది.

ఇక్కడ పాదాదిలోని మొదటి అచ్చుకు, ఇత్వసంధిలో ఇకారానికి పరమైన అచ్చుతో యతి చెల్లుతుంది.

**ఉదాహరణ:**

"అస్త్రవిద్యలు గఱచి నాద్దైన యిష్ట.."

(శ్రీమదాంధ్ర మహాభారతము – ఆదిపర్వము 5-224)

పాదాదిలోని 'అ' కారంతో, నాది + ఐన = నాద్దైన లోని పరపదమైన 'ఐన' మొదటి అక్షరమైన 'ఐ' తో యతి చెల్లింది.

**3. ఉత్వ సంధి**

సూత్రము: ఉత్తునకు అచ్చు పరమగునప్పుడు సంధి నిత్యము.

ఇక్కడ పరవర్ణమైన అచ్చుతో యతి చేయాలి.

**ఉదాహరణ:**

"అచటి విప్రులు మెచ్చురఖిలవిద్యాప్రౌఢి"

(మనుచరిత్రము 1-50)

పాదాదిలోని 'అ' కారానికి, మెచ్చురు + అఖిల లో పరపదంగా వచ్చిన 'అఖిల' లోని మొదటి అక్షరమైన 'అ' తో యతి చెల్లింది.

**4. యడాగమము + అచ్చు**

సంధి లేని చోట అచ్చుకంటే పరమైన అచ్చుకు 'యడాగమం' వస్తుంది. అంటే పరంగా ఉన్న అచ్చుకు పూర్వంగా 'య్' అనే అక్షరం ఆగమంగా వస్తుంది.

యడాగమం వచ్చినప్పుడు 'య'కారంతో కూడిన అచ్చు కనిపిస్తుంది. ఆ 'య'కారంతో కాకుండా, పరంగా వచ్చిన అచ్చుతోనే యతి చేయాలి.

**ఉదాహరణ:**

"ఆచరించెద నేను నీ యాశయంబు" **(కల్పితము)**

నీ + ఆశయంబు = నీ యాశయంబు.

ఇక్కడ పాదాదిలోని 'ఆ' కారానికి, పరపదమైన 'ఆశయంబు' లోని తొలి అక్షరమైన 'ఆ' తో (యడాగమానికి పరంగా వచ్చిన ఆకారంతో) యతి చెల్లింది.

**5. ద్రుతము + అచ్చు**

ద్రుతానికి అచ్చు పరమైనప్పుడు నకారంతో కూడిన అచ్చు కనిపిస్తుంది. ఆ నకారానికి పరంగా వచ్చిన అచ్చుతోనే యతి చేయాలి తప్ప, నకారంతో యతి చేయకూడదు.

**ఉదాహరణ:**

"ఆ యెలనాగ నీకుఁ దగు నంగనకున్ దగుదీవు"

(శ్రీమదాంధ్ర భాగవతము 10.1-1714)

తగున్ + అంగనకున్ = తగునంగనకున్.

ఇక్కడ పాదాదిలోని 'ఆ' కి, ద్రుతానికి పరంగా వచ్చిన 'అ' కారంతో యతి చెల్లింది.

**ముగింపు**

తెలుగు సంధులు, సంస్కృత సంధులు అనే విభజనతో సంబంధం లేకుండా, ఏ సంధిలోనైనా పరపదంగా అచ్చు వస్తే ఆ అచ్చుతోనే యతి చేయాలి కానీ, దానికి పూర్వంగా ఉన్న హల్లుతో యతి చేయకూడదు. **(సశేషం)**

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

లాస్యంబున్ బొనరించె మాధవుఁడు గైలాసాద్రిపై రంభతో

**ధనికొండ రవిప్రసాద్, హైదరాబాదు**

హాస్యమ్మాడుచు నాలి యిట్లనియె "నాట్యాచార్య డౌటన్ విలా
సాస్యుండై హిమశైల యాత్ర కెదలో నానంద ముప్పొంగగా
లాస్యమ్మున్ బొనరించె మా ధవుడు కైలాసాద్రిపై, రంభతో
లాస్య మ్మాడగ నైన శక్తుడె కళా లోలుండు స్త్రీలోలుడున్"

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

శిష్యా! పూరణ మాలకించు మదిలోఁ జిత్రించుమక్షౌహిణీ
దాస్యంబొందుచు త్ర్యంబకున్ వరునిగన్ దాఁ తీర్చు సంరంభుఁడై
హాస్యంబొప్పగ పందిరిన్ మలచు విన్యాసంపుటుత్సాహమై
లాస్యంబున్ బొనరించె మాధవుఁడు కైలాసాద్రిపై రంభతో!

**అక్కెర కరుణా సాగర్, హనుమకొండ**

హాస్యోక్తంబుల నైన నెంచ దగదే యన్యంపు భావంబులన్,
దాస్యాత్మన్ దను నెమ్మనంబునను సందర్శించ రూపంపు సా
రస్యంబే శివ కేశవుల్, నిజము! తద్రమ్యంపు దృశ్యంబునై
లాస్యంబున్ బొనరించె మాధవుడు కైలాసాద్రిపై రంభతో!

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

ఆస్యమ్మందున నవ్వు చిప్పిలగ నత్యంతాస్థతో రాధతో
వస్యమ్మయ్యెను శంకరుండుశివకే ప్రాంతమ్ములో నెంచగా?
లాస్యంబున్ బొనరించు నిత్యమును సుత్రాముండు, వైనమ్ముగా
లాస్యంబున్ బొనరించె మాధవుడు, గైలాసాధ్రిపై, రంభతో

**రాకుమార, గోదావరిఖని**

లాస్యంబున్ బొనరించె మా ధవుడుగైలాసాద్రిపై,రంభతో
హాస్యంబాడెదశాననుండుఖలుడైఆర్భాటమున్ సల్ప, ని
ర్దాస్యుండై నలకూబరుండుహరునిన్ ప్రార్థింప,నుద్బోధ పం
చాస్యుండైకరుణించెనంచు మహికిన్ చాటించె నా పార్వతిన్.

**సర్వాజోస్యుల గౌరీశంకర శాస్త్రి, తగరపువలస**

ఆస్యంబుల్ తగనైదు కల్గు హరు సంధ్యానృత్యమెట్లయ్యెనో?
సస్యాపేక్షిత వర్షమేఘముల సాదృశ్యమ్మదే దైవమో ?
వాస్యమ్మా నలకూబరుండెచటనో యాశ్లేషముల్ భామతో?
లాస్యంబున్ బొనరించె; మాధవుడు; కైలాసాద్రిపై; రంభతో

**వేదాల గాయత్రీ దేవి, హైదరాబాదు**

దాస్యంబున్ బొనరింప జేసి బుధులన్ దండించు రాజన్యులన్
లాస్యాకారమనోహరాకృతియె శూరత్వంబునం గూల్చి తా
హాస్యానందము తోడవెళ్ళియట తానానందియై నచ్చటన్
లాస్యంబున్ బొనరించె మాధవుడు కైలాసాద్రిపై రంభతో.

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

హాస్యంబొందఁగ సంతసించి సతి నాట్యంబెంచుచున్ భర్తతో,
దాస్యాప్తుండు సనాతనుండు నితఁడే, త్ర్యక్షున్ నివాసమ్మిటన్,
జోస్యంబొందె నశించ రావణుఁడిలన్, శోకించి శాసించఁగన్
లాస్యంబున్ బొనరించె, మాధవుఁడు, గైలాసాద్రిపై, రంభతో.

**ప్రబల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉండవల్లి సెంటరు**

హాస్యంబాడుచు వెండికొండపయి నాట్యారంభమున్ జేయ పం
చాస్యుండున్, జతగూడె పార్వతి, విలాసంబున్ ప్రదర్శించుచున్
లాస్యంబున్ బొనరించె ,మాధవుఁడుగైలాసాద్రిపై రంభతో
లాస్యాంతర్గత రీతి నేర్వ మదిలో లజ్జించె రంభాత్మయున్.

## దత్తపది

'జలము - వారి - నీరు - సలిలము' పదాలతో దావానలాన్ని వర్ణిస్తూ స్వేచ్ఛాఛందంలో పద్యం వ్రాయండి.

**ధనికొండ రవిప్రసాద్, హైదరాబాదు**

శా. శ్రీవారిన్ గను నట్టి యాస లిల మున్ శ్రేయమ్మటం చెంచి నన్
బ్రోవన్ బూజల మున్ గ దల్చ జననీ! రుద్రుండె కన్ విప్పెనో!
యావజ్జంతుతరుల్ మహాగ్ని బడగా, నా ఖాండవమ్మే యనన్
దావాగ్నుల్ చెలరేగె నా యడవిలో దారుల్ గనన్ గష్ట మై

సమస్య: గిరిసాంగత్యము చేత శిష్టజను లక్షీణార్తినిం బొందరే
దత్తపది: "తల' పదం నాలుగు పాదాలలో వచ్చేవిధంగా ఉత్పలమాలలో పోతన కవిత్వాన్ని ప్రశంసిస్తూ పద్యం వ్రాయండి.
(పూరణలు 15 నవంబరు 2026 లోపు 7702121376 ఫోన్ నంబరుకు పంపాలి)

**ధనికొండ రవిప్రసాద్, హైదరాబాదు**

శా. శ్రీవారిన్ గను నట్టి యాస లిల మున్ శ్రేయమ్మటం చెంచి నన్
బ్రోవన్ బూజల మున్ గ దల్చ జననీ! రుద్రుండె కన్ విప్పెనో!
యావజ్జంతుతరుల్ మహాగ్ని బడగా, నా ఖాండవమ్మే యనన్
దావాగ్నుల్ చెలరేగె నా యడవిలో దారుల్ గనన్ గష్ట మై

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

చ. సలిలము లింకి పోయెను ప్రజాపతి వాడి మయూఖ దాటి జం
గలముల పాదపమ్ములవి క్రన్నన నెండగ నీరు లోపమై
కలుగగ వారి దమ్ములిల క్ష్మాజము లన్నియు దగ్ధమొందగా
జలములు లేక యార్పుట యసాధ్యము, దైవమె నేడు దిక్కికన్

**రాకుమార, గోదావరిఖని**

తే.గీ. సలిలమునబుట్టుగరళంబు చరితరీతి
కజ్జల,ముగుదసరణిని కాననంబు
విసిగికన్నీరుబెట్టుచు దెసలపొగుల
వారిజమునెత్తికదిలె దావానలంబు.

**వేదాల గాయత్రీ దేవి, హైదరాబాదు**

చం. సలిలము లేక యెండెడి ప్రశాంత వనంబుల నగ్ని రాగిలన్
చలనముమీర సాగగను, చల్లని నీరు కొరంత కాగ క,
జ్జలములరీతి భస్మమయె, చయ్యనదావము ప్రజ్వరిల్లగా
పలువిధజంతునాశకర, వారి విరోధి బిభీష నింపెగా.

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

ఉ. కానలఁ బుట్టుచున్ 'జలముఁ' గాంచుచు వాసములందుఁ జొచ్చి దా
వానలమైచనంగఁ గడు బాధలఁ గంటను 'నీరు' చిమ్మెనే
ఆనని మంటలన్ 'సలిలమా'విరి యయ్యెనె జ్వాలకాహుతిన్
దానుగ 'వారి'జాక్షుఁడటు తగ్గగఁ జూడడె క్రుంగి పోతిమే.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

ఉ. శంకర నేత్ర కజ్జలము జార్చిన మంటలు రేగఁ గానలన్
కింక వహింప ప్రాణులవి కీలల జిక్క నివారితంబొకో!
శంకయె? బూడిదౌ తరులు! జ్వాలలు రేగగ నీరులావిరౌ!
యంకము నైన గంగవిడు త్ర్యంబక! నీ సలిలమ్ములార్పెదున్

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

చ. సలిలము లింకి పోయెను ప్రజాపతి వాడి మయూఖ దాటి జం
గలముల పాదపమ్ములవి క్రన్నన నెండగ నీరు లోపమై
కలుగగ వారి దమ్ములిల క్ష్మాజము లన్నియు దగ్ధమొందగా
జలములు లేక యార్పుట యసాధ్యము, దైవమె నేడు దిక్కికన్

(7వ పేజీ తరువాయి) **విశ్వనాథ నైశిత్యం**

దుర్నిరీక్ష్యయైన అహల్యాదేవి శ్రీరామ దర్శనముచే శాప విముక్తయై పూర్వరూపమును పొంది సర్వులకును దర్శనీయ యైనది. అంతే ఒక్క మాటలో తేల్చివేసినాడు. శాపమున కిచ్చినంత ప్రాధాన్యం తద్విమోచనమున కీయలేదు.

ఇదే ఘట్టములో 18వ శతాబ్ది పూర్వార్థానికి చెందిన సముఖము వెంకట కృష్ణప్ప నాయకుడు తన "అహల్యా సంక్రందనము" లో

"…. బలారాతిని గోరి కూడితివి రాతిరి జామున గావున, బలా! రాతిశరీర మందు"మని శపించినాడు (3 – 127). విమోచన ఘట్టములో "…… ముందర రఘురాము డపుడు పోవుచు నుండన్ కెందమ్మి బోలు పాదము లందలి రేణువులు ఱాతి నందిన యంతన్" (3 – 135) అంటూ, తదుపరి సూచన ప్రాయముగా

శా. మృదువై మెల్లన గొంతసేపటికి సద్వృత్తంబుగానౌచు బెం
పొదవన్ గొంత కరంగి సోగ యగుచున్ బొల్పొంది యా రాయి చ
క్కదనంబేర్పడి మోహనాకృతి చెలంగన్ యౌవనశ్రీ తగన్
సుదతీ రత్నము గాగ నిల్చెను, మదిన్ జోద్యంబు వాటిల్లగన్
(3 – 136)

అక్కడి వారు ఆశ్చర్యపోయేట్లుగా ఆ రాయి కరగి మెల్లగా మనోహరమైన స్త్రీ రూపమును సంతరించుకొన్నది అనే విషయాన్ని దృష్టిని దేహసౌందర్యము మీద కేంద్రీకరించి ప్రబంధ శైలిలో పద్యము చెప్పి ముగించినాడు.

అప్పటినుండి ఏ కవి ఈ ఘట్టమును వ్రాసినా అహల్యను శిలారూపముగానే భావించుట పరిపాటియైనది – విశ్వనాథ వారితో సహా.

కానీ విశ్వనాథ వారి హృదయములోని ఆర్ద్రత, ఉదాత్తత, పౌరాణిక పాత్రల పట్ల వారికి గల గౌరవము వారి కవిత్వములోనికి ప్రవహించి, ఈ పద్యములో నూతన సౌందర్యమును సంతరించుకొని, వారిని ఇతరులనుండి ప్రత్యేక పీఠముపై నిలిపినది. ప్రతి పౌరాణిక పాత్రను ప్రత్యేక గౌరవముతో నిశితముగా పరిశీలించి అప్పటికి వాడుకలోనున్న లోకాపవాదములను తొలగించి ఆయా పాత్రల పట్ల గౌరవభావమును కలిగించుటయే విశ్వనాథ వారి జీవిత లక్ష్యము. వారికి పౌరాణిక పాత్రలయందు గల ఈ ప్రత్యేక గౌరవము, దానిని వారు వివరించు తీరు వారిని నేరుగా నన్నయ సరసన నిలబెడుతున్నది.

# అవధానచరిత్రలో అద్భుత అధ్యాయం - నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానం

**అవధానమన్న పదానికి చిరునామా తెలుగు వాడు. అవధాన ప్రక్రియ అన్ని భాషలలో కంటే తెలుగు భాషలోనే ఎంతో రంజకంగా ఉంటూ, సమాజాన్ని రంజింపజేస్తూ, సంస్కృతివైపు మార్గనిర్దేశనం చేస్తూ, అవధానిని విశ్వవిజేతగా మారుస్తుందని భాషావేత్తల అభిప్రాయం. అటువంటి అవధానకళను వ్యాకరణం, ఛందస్సు, శాస్త్రాలు చిన్నప్పటి నుండి గురుకులంలో చదువుకున్న వారే చేయగలరు అనుకుంటే పొరపాటే! కేవలం 22 సంవత్సరాల యువకుడు, అదీ, అటు ఐఐటీలో సాంకేతికవిద్యలో అత్యుత్తమ ఫలితాన్ని సాధిస్తూనే, ఇటు ఎందరో ఉద్దండ పండితులు సైతం ముక్కు మీద వేలువేసుకొనేలా అవధానకళలో ఆరితేరిన 'నల్లాన్ చక్రవర్తుల సాహిత్' ప్రతిభ అనిర్వచనీయం. 'దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక' నిర్వహణలో, శ్రీ పుష్పగిరి పీఠ మహాసంస్థానం జగద్గురువుల చాతుర్మాస్యం సందర్భంగా, భాగ్యనగరంలోని బేగంపేట పుష్పగిరి మఠం వేదికగా, సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో ఐఐటి నిపుణుడు 'శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్' చేసిన ప్రథమ శతావధానంపై ప్రత్యేక నివేదిక.**

గత అనేక సంవత్సరాలుగా ఆధ్యాత్మికం, జ్యోతిషం సంగీతం, సాహిత్యం, అవధానం – ఇలా అనేక ప్రక్రియలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న **'దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక'** ఆధ్వర్యంలో, 2026 సంవత్సరం సెప్టెంబర్ నెల 18, 19, 20 తేదీలలో, శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారి చాతుర్మాస్యం సందర్భంగా, స్వామి వారి సమక్షంలో, అలాగే వినాయకనవరాత్రోత్సవాల సందర్భంగా, భాగ్యనగరం బేగంపేటలో ఉన్న పుష్పగిరి మఠం వేదికగా, 'శతావధాన విద్వన్మరాళ' శ్రీ ఆముదాల మురళి సంచాలకత్వంలో, యువ అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానం ఎందరో ఉద్దండ పండితులూ, సహస్రావధానులూ, శతావధానులూ, పద్యకవుల మధ్య, మూడురోజుల పాటూ అంగరంగ వైభవంగా, సాహిత్య – సాంస్కృతిక – ఆధ్యాత్మిక సమ్మేళనంగా నిర్వహించబడింది.

## పూర్వరంగం

అవధాన విద్యా వ్యాప్తి కోసం, నూతన అవధానులను తయారు చేసి వారికి వేదిక కల్పించడం కోసం గడిచిన 5 సంవత్సరాల నుండి 'అవధాన విద్యావికాస పరిషత్' మరియు 'దర్శనమ్' సంస్థ సంయుక్తంగా ఏడురోజుల ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా, 2022లో మొట్టమొదటి శిబిరంలో అవధానంపై ఆసక్తితో విద్యార్థిగా విచ్చేసిన ఐఐటీ విద్యార్థి, ప్రతిభాశాలి శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, అప్పటికే శ్రీ అన్నమరాజు ప్రభాకర్ రావు వద్ద పద్యరచనలో శిక్షణ పొంది ఉన్నారు. శ్రీ సాహిత్ శిబిరానికి వచ్చిన మూడవరోజే, పెద్దలు, గురువుల ప్రోత్సాహంతో తన ప్రతిభను చాటుతూ, శిబిరంలో అష్టావధానం చేసి పండితులచే శభాషనిపించుకొన్నారు. తదుపరి శతావధానులు శ్రీ ఆముదాల మురళి, శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ వంటి పండితుల వద్ద శిష్యరికం చేసి, అప్పటి నుండి ఇప్పటి వరకు 27 అష్టావధానాలు, 2 అర్ధశతావధానాలు పూర్తిచేసారు శ్రీ సాహిత్. ఇదే క్రమంలో, ఒక మెట్టు పైకెక్కుతూ, 2026 సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో 'అవధాన కళాకౌముది' శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ దర్శనమ్ సంస్థ నిర్వహణలో దిగ్విజయంగా శతావధానం చేసారు.

## మొదటి రోజు – ప్రారంభసభా సంరంభం

శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ప్రథమ శతావధానం సభావేదిక 'కోలాచల మల్లినాథ వేదిక' పేరుతో ఉద్ఘాటించబడి, శ్రీ కొణకళ్ళ రాధాకృష్ణ శర్మ బృందం నామసంకీర్తన కార్యక్రమంతో మంగళ ప్రదంగా ఆరంభమైంది. ఆ తరువాత, శతావధానం ప్రారంభ సభకు అధ్యక్షులుగా 'మహామహోపాధ్యాయ' శతావధాని శ్రీ దోర్బల ప్రభాకర శర్మ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా భారతదేశ ప్రభుత్వ పూర్వ కేంద్రమంత్రి శ్రీ అశ్వినీకుమార్ చౌబె విచ్చేసి, ఈ రకమైన అవధాన కార్యక్రమాలు వికసిత భారతాన్ని, సనాతనధర్మాన్ని స్థాపించడానికి ఎంతో ఉపయోగ పడతాయని, శతావధానం సాధారణపరీక్ష కాదని, అందుకు స్మరణశక్తి, కావ్యప్రతిభ, ఛందోజ్ఞానం, సద్యఃస్ఫూర్తి కలగలిసి ఉంటాయని తెలియజేస్తూ, నిర్వాహకులైన శ్రీ మరుమాముల వేంకటరమణ శర్మ, శ్రీ దత్తాత్రేయశర్మలను అభినందించి, శతావధానం చేయబోతున్న అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే, వేదికపై పుష్పగిరి జగద్గురు శ్రీశ్రీ శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారు ఆసీనులై, వేదమంత్రాలతో అవధానకళను అనుసంధానిస్తూ, అవధాన కార్యక్రమానికి మంగళాశాసనాలను అందించారు. ఇక, ప్రారంభ సభకు విశిష్ట అతిథులుగా ప్రముఖ చలనచిత్రనటులు, దర్శకులు శ్రీ తనికెళ్ళ భరణి విచ్చేసి, తనకు అవధానవిద్య, పద్యం పట్ల ఉన్న ప్రేమాభిమానాలను తెలియజస్తూ శతావధానం దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా 'అవధాన విద్యా వికాస పరిషత్తు' వ్యవస్థాపకులు శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ప్రస్థానాన్ని వివరించారు. అలాగే, తెలంగాణా పూర్వ ముఖ్యమంత్రి

ప్రజాసంబధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, పుష్పగిరి ఆస్థానపండితులు శ్రీ మేడూరి సూర్యనారాయణ, పుష్పగిరి ఆస్థానకవులు అవధానులు డా. ముత్యంపేట గౌరీశంకర శర్మ – శ్రీ ముదగొండ అమరనాథ శర్మ తదితరులు విచ్చేయగా, జ్యోతిఃప్రజ్వలన, గురువందనం ప్రార్థనతో, శ్రీ గంటి నగేష్ శర్మ చేసిన శంఖనాదంతో శతావధానం ఘనంగా ప్రారంభమైంది.

ప్రారంభసభలో భాగంగా శ్రీ వనం జ్వాలా నరసింహారావు రచించిన 'Simplified and Faithful Rendering of the Adikavya' అనే పుస్తకం, అలాగే ప్రముఖదర్శకులు, నటులు, శ్రీ నిట్టల గోపాలకృష్ణ రచించిన 'గోమాత' పుస్తకం మరియు శతావధాని డా. దోర్బల ప్రభాకర శర్మ రచించిన 'శ్రీపాద శ్రీవల్లభ లీలామృతం' పుస్తకం అతిథుల మధ్య అవిష్కరించబడ్డాయి.

ఆ తరువాత, అసలు శతావధానంలో మొదటి ఘట్టం ప్రారంభమైంది. 'కుదురాటగండ' శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించగా, ఈ మూడురోజుల శతావధానానికి శతావధాని శ్రీ ఆముదాల మురళి సభాసంచాలకపీఠాన్ని చేపట్టి, శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ కృషిని, శ్రీ మరుమాముల సోదరుల పరిశ్రమను ప్రశంసిస్తూ, సమస్యాపూరణల ప్రశ్నలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మొట్టమొదటి సమస్యను సాక్షాత్తు జగద్గురువులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారే అవధాని సాహిత్‌కు సంధించారు. **'హంసను నెక్కి శంకరుడు హాయిగ నిల్చెను శారదాంబతో'** అనే సమస్యను జగద్గురువులు ప్రసాదించగా, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ఏమాత్రం తడుముకోకుండా, **'సంసృతిఁ బాపఁగా ధరను శంకరుడే జనియించె మౌనియై'** అని సందర్భోచితంగా ఆదిశంకరాచార్యుల ప్రస్తావనతో మొదటి పాదాన్ని పూరించారు. అలాగే, శ్రీ మాచవోలు శ్రీధరరావు **'రణము విస్మరించునెడ కల్గవు కీర్తియు గౌరవమ్ములున్'** అని ఛందోగోపనంతో సమస్యను చిక్కుముడిగా ఇవ్వగా, అవధాని శ్రీ సాహిత్ **'అరదము డిగ్గి, గాండివము హా! యని వీడిన పాండుపుత్రునిన్'** అని నాటీకయశైలిలో సమాధానం చెప్పడం అందరికీ ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది.

ఈ విధంగా మొదటిరోజు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు 25 సమస్యలను ప్రాశ్నికలు ఇవ్వగా, వాటన్నిటికీ మొదటి పాదాలను వేగంగా సమాధానంగా చెప్తూ, మరొకవైపు అవధానంలో అప్రస్తుత ప్రసంగాన్ని చేస్తున్న శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి సంధించిన చమత్కార ప్రశ్నలకు దీటుగా జవాబులు చెప్తూ, సభను రంజింపజేస్తూ శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అందరి మెప్పులను పొందారు. అలాగే, ప్రత్యేకించి మాజీ కేంద్రమంత్రి శ్రీ అశ్వినీకుమార్ చౌబే అద్వైత వేదాంతం గురించి ఆశువుగా పద్యం చెప్పమని అడగగా, అవధాని శ్రీ సాహిత్ హిందీలో పద్యం చెప్పి తమ హిందీ పాండిత్యాన్ని కూడా చాటారు. అలాగే, శ్రీ తనికెళ్ల భరణి, ప్రధానమంత్రి గురించి పద్యం చెప్పమనగా, **'రాముని చూడకున్న రసరమ్యుని కృష్ణుని చూడకున్న ప్రధానమంత్రిని చూస్తే చాలని'** చెప్పి మెప్పించారు. ఈ శతావధానానికి లేఖకురాలిగా శ్రీమతి ఆరవల్లి శ్రీదేవి వ్యవహరించారు. అలాగే, ప్రతిపద్యానికి సరసమైన వ్యాఖ్యానం చేస్తూ సంచాలకులుగా శతావధాని శ్రీఆముదాల మురళి సభను విజయవంతంగా ముందుకు నడిపించారు.

మరల మొదటిరోజు మధ్యాహ్నం 4:00 గం.కు తిరిగి మొదలైన శతావధానంలో, ప్రాచార్య శ్రీ శలాక రఘునాథ శర్మ అధ్యక్షులుగా విచ్చేసి, అవధాని శ్రీ సాహిత్‌ను ఆశీర్వదిస్తూ, ప్రసంగం చేసారు. తదుపరి వెంటనే 25 దత్తపదులకు మొదటి పాదాలను అందిస్తూ, మధ్యమధ్యలో ఆశువు ప్రశ్నలకూ పద్యాలను చెప్తూ, వేగంగా ముందుకు సాగారు. ఈ సభలో శ్రీ ధనికొండ రవిప్రసాద్ అప్రస్తుత ప్రసంగం చేస్తూ, అవధానితో సరసల్లాపాన్ని చేసారు. తదుపరి గురుసహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్ అధ్యక్షతలో 25 వర్ణన ప్రశ్నలకు ఒక్కొక్క పాదాన్ని, కొన్నిటికి రెండు పాదాలను కూడా చెప్తూ, మత్తకోకిల, తరువోజ వంటి అరుదైన ఛందస్సులలో కూడా పద్యాలను, అంశాలను సరసంగా, సద్యస్ఫూర్తిగా అవధాని శ్రీ సాహిత్ వర్ణించగా, మొదటిరోజు శతావధనం దిగ్విజయంగా 75 ప్రశ్నలనూ తీసుకోవడంతో పూర్తయ్యింది.

తదుపరి, శ్రీ చింతలపాటి శూలపాణి బృందంచే పోతన భాగవతం ముఖ్యఘట్టాల నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది

## రెండవ రోజు – పద్యపూరణ రసప్రేరణ

ఇక, ఉత్సాహభరితంగా రెండవ రోజు, రాధాష్టమి పండుగ కాగా, శతావధాన కార్యక్రమం శ్రీ మరుమాముల శశిధర శర్మ బృందంచే సంగీత నీరాజనంతో ఆధ్యాత్మికంగా మొదలైంది. తదుపరి, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, సంచాలకులు శ్రీ ఆముదాల మురళి వేదికకు చేరుకోగా, ఈ రెండవ రోజు ఉదయం సభకు అధ్యక్షులుగా న్యాయవాది శ్రీ నారుమంచి అనంతకృష్ణ, విశిష్ట అతిథిగా గురుసహస్రావధాని డా. శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్, శతావధాని డా. శ్రీ తాతా సందీప్ శర్మ పాల్గొన్నారు. ముందు రోజు సమస్యలను ఇచ్చిన ప్రాశ్నికులను శ్రీమతి ఆరవల్లి శ్రీదేవి వేదికపైకి ఆహ్వానించగా, అవధాని సాహిత్ మొట్టమొదటిగా మొదటిరోజు పుష్పగిరి జగద్గురువులు ఇచ్చిన సమస్యను పూరిస్తూ,

**'ఉ.సంస్కృతి బాపఁగా ధరను శంకరుడే జనియించె మౌనియై**
**హంసగ జ్ఞానకర్మముల యందున భక్తినిఁ జూపి, అద్వితా**
**శంసన చేసి, సోహమను స్థైర్యమునన్ కలి యంకమొందఁగా**
**హంసను నెక్కి శంకరుడు హాయిగ నిల్చెను శారదాంబతో'**

అని సమస్యలో ఉన్న శంకరుణ్ణి ఆదిశంకరాచార్యులుగా చెప్పి, పరమహంసపదవిని ఎక్కి, ఆ శారదాంబ ఒడిలో కూర్చున్నారు.... అని అద్భుతంగా పూరించి, జగద్గురువుల అనుగ్రహానికి పాత్రులయ్యారు.

అలాగే, మరొక ప్రాశ్నికులు శ్రీ ముత్యంపేట గౌరీశంకర శర్మ మొదటిరోజు **'సారము లేనివాడు సరసంబుగ జేసె శతావధానమున్'** అని ఇచ్చిన సమస్యకు, అవధాని సాహిత్ తాను 50 మందితో ముందు అవధానం చేయడం వలన అందరూ తనను 'స్వర్ణావధాని' అనే పేరుతో పిలుస్తారు కానీ, తన పేరులో అయఃసారము (ఉక్కు) లేదు అనే చమత్కార పూరితమైన భావంతో, సారము అనే పదాన్ని అయస్సారముగా మార్చి పూరించిన తీరుకు ప్రేక్షకులలో నవ్వుల జల్లులు కురిసాయి. అలాగే, కుమారి అయ్యల సోమయాజుల అహల ఇచ్చిన **'పరులను గని పాండుసుతుడు భయపడె ననిలో'** అనే సమస్యకు **'ఎక్కడ ఎప్పుడు పరులను గని పాండుసుతుడు భయపడె?'** అని సమాధానాన్ని ప్రశ్నాత్మకంగా మార్చి, అర్జునుడి వ్యక్తిత్వాన్ని రంగరించారు. అలాగే, మధ్యలో మరికొన్ని ఆశువులనూ పూరిస్తూ, ఈ శతావధాన నిర్వాహకులూ, తమ సోదరులూ అయిన శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ – వేంకటరమణ శర్మల పరిశ్రమను గురించి ప్రాశ్నికులుగా వచ్చిన శ్రీ మరుమాముల శశిధర్ శర్మ పద్యం చెప్పమని అవధానిని అడగగా

**'కం. స్థిరధర్మరక్షణము నూ**
**పిరిగా, సాహిత్యరక్ష వెన్నెముక వలెన్**
**నిరతము కలిగి చెలంగెడి**
**మరుమాముల సోదరులను మరిమరి కొలుతున్'** అంటూ,

మరుమాముల సోదరులు ధర్మరక్షణే ఊపిరిగా, సాహిత్యరక్షణే వెన్నెముకగా కలిగి ఉన్నారని కొనియాడారు అవధాని. ఈ విధంగా, 25 సమస్యలలో ప్రతీదీ దేనికదే విలక్షణంగా, రసవంతంగా, చిక్కుముళ్లను విప్పుతూ, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పండితుల ప్రశంసలనందుకున్నారు. అలాగే, ఈ ఉదయం సభకు అప్రస్తుతప్రసంగం చేస్తూ శ్రీ దండిభొట్ల దత్తాత్రేయ శర్మ సభలో హాస్యం పండించారు. తదుపరి, శ్రీమతి డా. అనంతలక్ష్మి రచించిన 'రాసేశ్వరి' మరియు 'శ్రీమద్రామాయణ ఉపాఖ్యానాలు – సార్వకాలికత' పుస్తకాలు శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడ్డాయి.

ఆ తరువాత, రెండవరోజు సాయంత్రం సభకు అధ్యక్షులుగా 'శతావధానపంచానన' శ్రీ డా. జి.ఎమ్. రామశర్మ విచ్చేయగా, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ముందురోజు ఒక్కొక్క పాదం మాత్రమే చెప్పిన 25 దత్తపదులకు పూర్తి పూరణలను అందించి విద్వాంసులను అలరించారు. ప్రాశ్నికులు ఇచ్చిన పదాలకు – అడిగిన అంశానికి ఏ మాత్రం పొంతన లేకపోయినా, ఆ చిక్కుముళ్ళను అవధాని తన ప్రతిభతో, భాషాపాండిత్యంతో పరిష్కరిస్తూ, రసరమ్యంగా, భావస్ఫోరకంగా పద్యం చెప్పడం పట్ల సభాసదులు హర్షం వ్యక్తం చేసారు. ఉదాహరణకు – **'కొను, బనేగా, కరోడు, పతి'** అనే నాలుగు పదాలతో 'దమయంతి సౌందర్యం' గురించి పద్యం చెప్పమని ప్రాశ్నికులైన శ్రీ మామిళ్ళ లోకనాథం అడుగగా,

**"ఉ. ఉన్నది యంచు సందియము లొప్పఁగఁ జేసెడి 'కొను' కల్గి, ఆ**
**వెన్నెల యు'బ'్బ నేఁ గ'ర'ము వేడ్కకు నాకరనంచు దాని భ్రాం**
**తిన్నిరసించు నా సుగుణదీధితి కల్గి నిశా'కరోడు' సం**
**పన్నిధి చూపులన్ వెలిగి వర్ధిలు నా దమయంతి భూ'పతీ'!"**

అని అవధాని వర్ణించిన తీరు అనన్యసామాన్యమని పండితులందరూ వేనోళ్ల కొనియాడారు. ఈవిధంగా 25 దత్తపదులకు కూడా అందరి ఆమోదంతంతో, సరససుందరంగా అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పద్యాలను పూరించి, మెప్పించారు. ఈ సాయంత్రం సభకు అప్రస్తుత ప్రసంగం చేస్తూ విఖ్యాత సంస్కృతాంధ్ర విద్వాంసులు శ్రీ రంగి సత్యనారాయణ సభలో నవ్వులు పూయించారు. ఈ విధంగా, మొదటి రోజు 25 సమస్యలను, 25 దత్తపదులను, 20 ఆశువులను కూడా పూర్తిగా అవధాని పూరించి, సభను దిగ్విజయం చేసారు. ఆ తరువాత, ప్రసిద్ధ సంగీతవిదుషీమణి శ్రీమతి డా. ఎఱ్రమిల్లి రమాప్రభ బృందంచే భక్తిసంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది.

**మూడవ రోజు** – అఖండధారణ, విజయోత్సవ విజృంభణ

ఇక, అంగరంగ వైభవంగా సాగుతున్న శతావధానం చివరి రోజుకు చేరుకుంది. ఉదయం శ్రీ మరుమాముల శశిధర శర్మ బృందం భక్తి సంగీత సంగోష్ఠితో మంగళకరంగా ప్రారంభమైన శతావధానంలో అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ మొదటి రోజు కేవలం ఒకటి-రెండు పాదలు మాత్రమే చెప్పిన వర్ణనలను పూర్తిగా పూరించడం మొదలుపెట్టారు. ఈ సభకు అధ్యక్షులుగా విఖ్యాత సంస్కృత విద్వాంసులు ప్రాచార్య పిటిజివి రంగాచార్యులు విచ్చేసి, అవధానిని ఆశీర్వదించగా, విశిష్ట అతిథులుగా గురు సహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్, శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ విచ్చేసారు. ప్రాశ్నికులు అడిగిన అంశాలను వినూత్న కల్పనలతో సర్జనాత్మకంగా అవధాని పూరించిన తీరు ప్రశంసనీయమని వేదికపై అతిథులు కొనియాడారు. అవధానిని 'తెలుగు భాషా మాధుర్యాన్ని' గురించి ప్రాశ్నికురాలు శ్రీమతి మండపాక అరుణకుమారి చెప్పమంటే, "ఏ పలుకులలోని తీపిని

రుచి చూడడానికి చెవులే నాలుకలుగా మారిపోతాయో, అలాంటి పలుకులు గల భాషే తెలుగుభాష. అటువంటి తెలుగుభాషలో తన గురించి కావ్యం రాయమని శ్రీకృష్ణదేవరాయలు కలలోకి సాక్షాత్తు విష్ణు-అవతారమైన శ్రీకాకుళ 'ఆంధ్ర మహావిష్ణువు' వచ్చి చెప్పాడు కాబట్టి, దేవుడే ఒక భాష పేరుతో వెలసిన పవిత్రభాషగా తెలుగు భాష విఖ్యాతి గాంచింది" అనే భావంతో నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పద్యం చెప్పడం వర్ణనలలో మకుటాయమానంగా నిలిచింది.

అలాగే, తరువోజ అనే అరుదైన ఛందస్సులో నేటి కాలం గురుశిష్యుల సంబంధాన్ని చమత్కారంగా చెప్పి అవధాని మెప్పులు పొందారు. అలాగే, మిగిలిన ఆశువులను కూడా పూర్తి చూస్తూ, చివరి ఆశువులో ప్రాశ్నికురాలు శ్రీమతి వల్లీ సుబ్బలక్ష్మి అవధానికి ఇష్టదైవమైన హయగ్రీవస్వామిపై పద్యం చెప్పమని ప్రాశ్నికులు అడగగా, **'ఏ స్వామి ఏలి ఈ ఏడేడు లోకాలు, అలసి నా మదిలోన ఆదమరిచె'** అని అవధాని చెప్పిన సీసపద్యం విని, ప్రేక్షకులు ఉప్పొంగి చప్పట్ల వర్షం కురిపించారు. అలాగే, తిరుపతి నుంచి విచ్చేసిన ప్రాశ్నికులు శ్రీ ఉప్పలధడియం రాజీవ లోచన శర్మ "పుష్పగిరి జగద్గురుస్వామిపై" పద్యం చెప్పమని అడగగా, 'గురు-అనుగ్రహం ఒక రూపాన్ని పొందితే అదే పుష్పగిరి జగద్గురువుల రూపం' అని అద్భుతంగా వర్ణించారు. అలాగే, ఈ సభలో శ్రీ బంకుపల్లె రమేశ శర్మ అప్రస్తుత ప్రసంగం చేసి రంజింపజేసారు. ఈ విధంగా 100 పద్యాలను అద్భుతంగా పూరించి, అంతేకాక, మరొక మూడు ఆశువులను అదనంగా చెప్పి మొత్తం 103 అంశాలకు పూరణను విజయవంతంగా పూర్తి చేసారు అవధాని శ్రీ సాహిత్. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు అధ్యక్షులు శ్రీ బసవరాజు శ్రీనివాస్ విచ్చేసి, అవధానిని సత్కరించారు.

ఆ తరువాత, మధ్యాహ్నం సభలో ప్రాశ్నికుల స్పందన కార్యక్రమం నిర్వహించబడింది. అష్టావధాని శ్రీ యఱ్ఱంశెట్టి ఉమామహేశ్వర రావు, అష్టావధాని శ్రీ బోరెల్లి హర్షల ఆధ్వర్యవంలో, వారు ప్రాశ్నికులను క్రమానుసారంగా ఆహ్వానిస్తూ ఉండగా, ప్రాశ్నికులు శతావధానం పట్ల తమ స్పందనను, ఆనందాన్ని పద్యాల రూపంలో వెలిబుచ్చారు.

ఇక, సాయంత్రం సరిగ్గా నాలుగు గంటలకు, ఈ శతావధానం లోని ప్రధానమైన చివరి ఘట్టం మొదలైంది. మూడు రోజులుగా అవధాని శ్రీ సాహిత్ తాను పూరించిన 25 సమస్యలను, 25 దత్తపదులను, 25 వర్ణనలను – మొత్తం కలిపి 75 పద్యాలను అప్పజెప్పాలి. ఈ ధారణా సభకు అధ్యక్షులుగా 'మధురభారతి' శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వపు సలహాదారు డా. కె.వి. రమణాచార్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగ పూర్వ అధిపతి శ్రీ కె. అరవిందరావు, విఖ్యాతచలనచిత్ర నటులు, దర్శకులు శ్రీ తనికెళ్ల భరణి విచ్చేయగా, శతావధాని శ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ సభానిర్వహణ చేసారు.

ధారణసభలో అధ్యక్షులు శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, సంచాలకులు శతావధాని శ్రీ ఆముదాల మురళి, మూడు రోజులపాటు శతావధానం చేసిన అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ వేదికను అధిష్ఠించారు. అవధాని సాహిత్ యోగస్థితిలో, ఏకాగ్రమైన మనస్సుతో వేదికపై కనిపించారు. ధారణసభ మొదలైంది. అతిరథమహారథులందరూ వేదిక ముందు కూర్చొని చూస్తుండగా, శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి ఒక్కొక్క ప్రాశ్నికుని పేరు చదువుతూ ఉంటే, ఏ మాత్రం తడబడకుండా తాను మూడురోజులుగా చెప్పిన పద్యాలొక్కొక్కటీ రాగయుక్తంగా, పొల్లుపోకుండా ధారణ చేస్తూ ఉన్నారు అవధాని శ్రీ సాహిత్. ధారణ మొదలైన పదినిమిషాలకే, సభకు ముఖ్య అతిథి అయిన పద్మశ్రీ పురస్కృతులు, మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు సభలోకి ప్రవేశించారు. వేదిక ముందే కూర్చొని, అవధాని శ్రీ సాహిత్ అద్భుతంగా ధారణ చేస్తున్న ప్రతి పద్యాన్ని విని పులకించి, కరతాళధ్వనులు చేసారు డా. గరికిపాటి. ప్రేక్షకులందరి మనస్సులలోని ఆనందం, కళ్ళనుండి బాష్పాలుగా బయటికి వస్తూ ఉంటే, ఆ అవధానిని కన్న తల్లిదండ్రులూ సభలోనే కూర్చొని పుత్రోత్సాహాన్ని పొందారు. ఈ విధంగా, పరమాద్భుతంగా 75 పద్యాలను కేవలం 49 నిమిషాలలో అప్పజెప్పి, అవధానచరిత్రలో ఒక కొత్త శతావధానిగా పేరు గడించారు శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్. అలా ధారణ పూర్తయ్యిందో లేదో, సభలో కూర్చొని ఉన్న డా. గరికిపాటి, వేదిక ఎక్కి, తన కన్నకొడుకులాగా సాహిత్‌ను ముద్దుపెట్టుకొని, కౌగిలించుకొని, ఆనందబాష్పాలతో అవధానిని అభినందించారు.

వెంటనే, విజయోత్సవ సభ ప్రారంభమైంది. శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి వేదికపై ఆసీనులుకాగా, ముఖ్య అతిథి డా. గరికిపాటి నరసింహారావు, అలాగే విచ్చేసిన ఇతర అతిథులందరూ శతావధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు ఘనసత్కారాన్ని కన్నుల పండుగగా గావించారు. సాక్షాత్తు జగద్గురువులు అవధాని తలపై కిరీటం పెట్టగా, అతిథులు, నిర్వాహకులు కలిసి శాలువా, పట్టువస్త్రాలు, గజమాలలతో సత్కరించగా, శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ తాను రాసిన సన్మానపత్రాన్ని చదువగా, దాన్ని నిర్వాహకులు అవధానికి సమర్పిస్తూ 'శతావధాన కళాధర' అనే బిరుదుతో శతావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌ను సన్మానించారు. ఆ తరువాత, పద్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ, శ్రీ సాహిత్ తనకు పుత్రసమానుడూ, శిష్యుడూ అని చెప్తూ,

పంచను కట్టడంలో, వేషధారణలో గరికిపాటినే అనుసరిస్తున్నాడని చమత్కరించారు. అలాగే, శతావధాని శ్రీ సాహిత్ చెప్పిన పద్యాలలో భావుకత ఉందని, 22 ఏళ్ళకే ఇంత కవిత్వం చెప్పడం అసాధారణమని ప్రశంసిస్తూ, సభలోని వారంతా ఒక్క సారిగా ఆశ్చర్యంలో, ఆనందంలో మునిగిపోయేలా, డా. గరికిపాటి నరసింహారావు తన చేతి ఉంగరాన్ని తీసి శతావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు తొడిగి, తనను మించిన అవధానిగా ఎదగాలని అభినందించారు. దాంతో, సభలో కరతాళధ్వనుల వర్షం కురిసింది. అదేవిధంగా, పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారు 'శతావధానకళాధర' అనే బిరుదును శ్రీ సాహిత్‌కు ఇస్తున్నట్లు మరొకమారు సభలో ప్రకటించి, తమ అనుగ్రహభాషణాన్ని అందించారు.

అలాగే, విశిష్ట అతిథులుగా వచ్చిన డా. కె.వి. రమణాచార్యులు మాట్లాడుతూ శతావధాని శ్రీ సాహిత్ చేయబోయే పదవ శతావధానాన్ని కూడా తాను చూసే శక్తి భగవంతుడివ్వాలని ఆకాంక్షించారు. అలాగే, మాజీ డీజీపి శ్రీ కె. అరవిందరావు మాట్లాడుతూ, అవధాని శ్రీ సాహిత్ సంస్కృతాంధ్రాలలో చాలా మాధుర్యంతో పద్యాలను చెప్పారని ప్రశంసించారు. అలాగే, శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ, అవధానికి సమయస్ఫూర్తి, వినమ్రత, పాండిత్యం అన్నీ ఉన్నాయని అభినందించారు. ప్రముఖ చలనచిత్ర నటులు శ్రీ తనికెళ్ళ భరణి మాట్లాడుతూ, నేటి తరంలో శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, శ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ వంటి యువకులు అవధానాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారని, మూడు రోజులూ శతావధాని శ్రీ ఆముదాల మురళి సంచాలకత్వం రమణీయంగా ఉందని, శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి చేసిన అప్రస్తుతప్రసంగం చాలా బాగుందని తెలియజేసారు.

అలాగే, గురుసహస్రావధాని డా. శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్ ప్రసంగిస్తూ, ఎన్ని భాషలలో అవధానప్రక్రియను చేసినా, తెలుగులోనే అవధానం స్థిరపడి రాణించిందని, అందుకు కారణం తెలుగుభాషలోని ఒదుగుదలే అని తెలియజేసారు. అలాగే, శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ప్రసంగిస్తూ, శతావధాని శ్రీ సాహిత్ తనకు ప్రియశిష్యుడు, పౌత్రసమానుడూ అని తెలియజేసారు. అలాగే, 'మధురభారతి' శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, శతావధాని శ్రీ అయితగోని వెంకటేశ్వర్లు తమ పద్యాలతో శ్రీ సాహిత్‌ను అభినందించారు. శ్రీ వనం జ్వాలా నరసింహారావు మాట్లాడుతూ, ఈ సంవత్సరమైనా నోబెల్ సాహిత్య పురస్కారం అవధానరంగానికి రావాలని ఆకాంక్షించారు. అలాగే, శ్రీ మరుమామల దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ, అవధాన విద్యా వికాస పరిషత్తులో మొట్టమొదటి అవధానిగా ఎదిగిన విద్యార్థి శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్తే అని, అందుకు తమకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలియజేసారు. ఈ సందర్భంగా, అవధాన విద్యా వికాస పరిషత్తు ప్రతి మాసం ప్రచురిస్తున్న 'అవధాన పుష్కరిణి' మాసపత్రికను వేదికపై అవిష్కరించారు. అలాగే, AITEK సంస్థ వారు నిర్మించిన బ్రోచర్‌ను ఉద్ఘాటన చేసారు.

ఇదే సందర్భంగా, శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారు అనుగ్రహభాషణం చేస్తూ, అవధానం కోసం ఇంతటి బృహత్తరమైన కృషిని చేస్తున్న శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మకు పుష్పగిరి పీఠం తరఫున 'అవధాన కులపతి' అనే బిరుదును ఇచ్చి సన్మాన పత్రంతో సత్కరించారు, అలాగే, దర్శనమ్ సంస్థా నిర్వాహకులు శ్రీ మరుమాముల వేంకటరమణ శర్మను ఆశీర్వదించారు. అదే విధంగా, శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ధారణ సమయంలో కేవలం ప్రాశ్నికుని ముఖం చూడగానే, పద్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం చాలా గొప్ప విషయమని తెలియజేస్తూ, శతావధాన విజయోత్సవ సందర్భంగా జగద్గురువులు తమ మంగళాశాసనాలను అందించారు. ఆ తరువాత, జగద్గురువుల, అతిథుల సమక్షంలో, శతావధానంలో పాల్గొన్న ప్రాశ్నికులను నిర్వాహకులు ఘనంగా సత్కరించడంతో కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యింది.

ఈ విధంగా, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక నిర్వహణలో, గణపతి నవరాత్రోత్సవాల వేళ, శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి వారి చాతుర్మాస్య సందర్భంగా, భాగ్యనగరంలో, ఐఐటి నిపుణుడు శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానిగా విజృంభించి విజయం పొందిన ఈ ప్రథమశతావధానం అవధాన సాహిత్య చరిత్రలో ఒక గొప్ప అధ్యాయంగా చిరకాలం నిలుస్తుందని ప్రేక్షకులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

(11వ పేజీ తరువాయి)

## డా॥ తాతా సందీప్‌శర్మగారి అష్టావధానం

**ఛందోభాషణము:** కొరుప్రోలు రాధాకృష్ణ

| | | |
|---|---|---|
| 1. | (ప్రా) | మేలురాక యిదియె మిత్రమా సందీప |
| | (అ) | మోదమిచ్చునయ్య బుధజనులకు |
| | (ప్రా) | అరయనిచట మీకు అవధానమెట్లుండు |
| | (అ) | శారదావసరపు చంద్రికవలె |
| 2. | (ప్రా) | పరమవిలువలు మహిలోన పరగుటెట్లు |
| | (అ) | ధర్మమార్గమ్ము విడువక తనరునపుడు |
| | (ప్రా) | పరమసత్యము తెలిపెడు గురువులెవరు |
| | (అ) | అడుగునకు నడ్డమై యున్న అనుభవాలు |

**అప్రస్తుత ప్రసంగము:** పంతుల విట్టుబాబు

## ఈనెల అంశం: విఘ్న హర ..

**విద్వాన్ భైరపనేని పోతురాజు**

శా. శ్రీ గౌరీతనయా! ముకుంద వరదా !చిన్మోహ నాకార! శ్రీ
నాగేంద్రానన!నీకు మ్రొక్కి తొలి ,విఘ్నంబుల్ నివారింపగా
వాగీశాత్మజ బ్రోవు మనెదన్ ,భావంబులుప్పొంగగా
వేగన్ జూపవే నీదయన్ శుభకరా! విశ్వేశ సంధాయకా!

చ. పలుకులు పూవులై ప్రజల వాంఛలదీర్చు కవిత్వ ధారలై ,.
విలసిత మంద విఘ్నహర ప్రీతి ప్రసూన పదార్థ మీయవే
వలచితి నీవె దిక్కని వివాదములేదు కడింది ప్రేమతో
దలచితి నిన్ను భారమును దాల్చెడివాడవంచు దేవరా!

ఉ. కుఱ్ఱలు యొజ్జలన్ గురిగ కోమల విద్యల నేర్పురీతి నా
బుఱ్ఱల మంచి యోచనల బుద్ధివికాసము జేర్చి లక్ష్యముల్
జొఱ్ఱెడి భంగి నేర్పవలె శుద్ధి యు చేతన నాత్మ చింత నీ
బొఱ్ఱయె జ్ఞాన భాండమన పూజల చేకొని మమ్ము గాచవే.

మధ్యాక్కఱ..
తరళవిరుల మాల దాల్చి తలన సూక్ష్మనయన దృష్టి
సరసగుణ పగిది నుంచి శాంతము స్వాంతన మీయ
వరసిద్ధి నాయక మమ్ము భావింపవో యాప్తులనగ
కరములుమోడ్తుమునీకు కనికరమునుజూప రావె.

తరువోజ..
విఘ్నహర !విచిత్ర వేషము జూడ వేద విహారము వేద్యుడ వీవు
అఘ్నము వత్సము జూసెడు భంగి నాదరమునుజూప నాలస్యమేల
జఘ్నిగ పాపము జంపగ రమ్ము సంప్రదాయము లన్ని సాగక యుండె
జఘ్నుడవై సాగి జగతిని నిల్పు సామరస్యములను క్షాత్రము జూపి.

**డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాదు.**

ఉ. విఘ్నములన్ తలంపక సువీక్షిత దృష్టిని జూడుమయ్య! ఓ
విఘ్న వినాయకా! సుముఖ! వేనకు వేలు ఫలమ్ములంద ని
ర్విఘ్న జయాప్తి, కార్యములు వెంటనె సిద్ధిని పొంద గల్గ, నా
అఘ్నను కొల్చి, నిన్ నతుల నర్చన జేసెదమో వినాయకా॥

చ. కవులు విశేష లక్ష్యమున కావ్యములన్ రచియించునట్టులా
కవితలు దేశమందుగల కర్షక కార్మిక బాంధవానుజుల్
ప్రవిమల రీతులొప్పగల క్రాంతిని అభ్యుదయమ్ములంద సం
భవిత విధానముల్ గనుచు పాలన జేయుమ! ఓ వినాయకా॥

చ. కుడుములొసంగి నీవు మది కోరిన యట్టి పదార్థ సంతతిన్
వడి వడి గూర్చి అర్చనల ప్రార్థన జేసెద, దేశమందునన్
దుడుకడులన్ వధింప గల త్రోవల నెన్నుచు ధర్మరక్షకై
అడుగులు వేయ నెన్నిననె,అండగ నిల్చెదమో వినాయకా॥

## ఖండ-శర్కర

**నిర్వహణ: శతావధాని డా. ఎం.వి. పట్వర్ధన్**
**శతావధాని చేపూరి శ్రీరామ్**

ఉ. కర్షక బంధువర్గముల గాంచగ జాలవొ? నింగి జూచి ఈ
వర్షము, నీటి చిన్కు గన ప్రార్థనలన్ జలదంపు రాశులన్
వర్షమొసంగ వేడి, తమ బాధల వ్యక్తము జేయ గాంచవో?
హర్షము నంద జేయ మనమందు దలంపుమ! ఓ వినాయకా॥

మ. ఒకచో నీటి ప్రవాహ గండములతో నుండు ప్రజానీక మిం
కొకచో నీటి దరిద్ర బాధల గతుల్ యోచింపగా జాలవో?
వికటా! నీదు జయంతి వేడుకల సంప్రీతిన్ గనం జేయగా
అకళంకాత్ములు జీవనమ్ము గను సమ్యగ్యోజ సంధింపుమా॥

**అసనారె**

ఉ. పంకము నందు చిక్కి పలు పాపములన్ బొనరించి తేను నీ
వంకకు జూచు చుంటినిను భావము నందున నిల్పి నిష్ఠమై
శంకర పుత్ర! నిత్యమును సన్నుతి చేసెద చిత్తశుద్ధితో
సంకటముల్ హరించి నను సాకుము ప్రేముడి విఘ్ననాయకా!

ఉ. కారణ జన్ము డీవు భువి కామితముల్ నెరవేర్చు దైవమా!
నేరమయంపు నాయకులు నీతిని వీడి చరించు చుండి, య
వ్వారలు దోచు చుండిరె యవారితమైన విధమ్ముదీనులన్
ధారుణి దుష్టశీలుర విదారణ జేయుము విఘ్ననాయకా!

మత్త. పార్వతీతనయా! గణాధిప! పాహి పాహి! గజాననా!
పర్వమే యగు నీదు వీక్షణ! వక్రతుండుడ! శాంకరీ!
నిర్వహించెద నీకుపూజల నిర్మలమ్మగు భక్తితో
కర్వరిన్ బడు బాధ లన్నియు క్రన్ననన్ బడఁ ద్రోయుమా!

చ. చవితి దినమ్మునన్ గనక చంద్రుని నిన్ను భజింతు విఘ్న రా
జ! విమల మానసమ్మున గజాస్య! భవాత్మజ! బొజ్జదేవరా!
అవిరళమైన ప్రేమ వెనుకయ్య! యొసంగుము, నీకు మ్రొక్కెదన్
ప్రవిమలమైన జ్ఞానమిడ బ్రార్థన జేసెద విఘ్న నాయకా!

ఉ. స్వార్థపరుల్ ధరిత్రిపయి ప్రగ్గడలై పరిపాలనమ్ములో
నర్థము బొందగా సతతమమానుష కృత్యములాచ రింతురే

**తదుపరి అంశం**

**కార్తిక విభవం**

మకుటముతో 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు

ఖండికలు పంపవలసిన ఆఖరు తేది 15 నవంబరు 2026

వ్యర్థము చేయుచున్ ప్రజల యాస్తుల నిష్టము వచ్చినట్టు ల
త్యర్థ దురాశ యుక్తుల రయమ్మున గూల్చుము విఘ్ననాయకా!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

స్రగ్ధర
శ్రీ విఘ్నాధీశ భవ్యాశ్రిత గణవరదా శ్రేయ సంధాతృలోలా
భావాప్తోత్సాహ సంతృప్త నమసముల సంభావనోల్లాస భాతిన్
సేవాసక్తాన్వితమ్మున్ స్థిరముగఁ గని నీశిష్టులై సాగ ధాత్రిన్
దేవా నిర్విఘ్నమౌ భ్రాతిని విధులకు నీ దివ్య దాక్షిణ్య మొప్పున్

మాలిని ప్రథమ నుతుల పూజా ప్రార్థనార్హుండ వీవే
పథముఁ గరపుమా సౌభాగ్య సంప్రాప్త మొందన్
గథిత విధిని భవ్యోక్తంపు భక్త్యానురక్తిన్
బృథివినిటు భజింతున్ విఘ్ననాశా గణేశా

మత్త. వక్రతుండము నేక దంతము భవ్య రూపము నొప్పఁగన్
విక్రమమ్మున సాటిఁ గాంచని విఘ్నరాజుకు మ్రొక్కినన్
సక్రమమ్మగు దారియందున సాగుచుండెడి వారలై
యాక్రమించిన బాధలన్నియు నంతమొందును ధాత్రిలో

మందాక్రాంత ప్రారంభమ్మందునఁ గొలువ భావాప్త నిత్యానురక్తిన్
హేరంబున్ విఘ్నహరును గణాధీశునున్ శూర్పకర్ణున్
ధారాపాతమ్మగు నుతుల సద్భక్తితో సజ్జనాఢ్యుల్
గారాబమ్మున్ గను విభుఁడు నాకాంక్ష నిర్విఘ్నమొందున్

శా. శర్వాణీ తనయుండు విఘ్నముల నాశమ్మొంద ఖండించెడిన్
సర్వాప్తుండు సురార్చితుండు తొలి పూజల్ సేయఁగా నొజ్జయై
దుర్వారాకృతిఁ దాల్చి విజ్ఞప్తుల సంతోషమ్ముగాఁ గైకొనున్
సర్వోత్కృష్ట వినాయకుండిడఁగ రక్షన్ శ్రద్ధతో మ్రొక్కుడీ

# పద్యపరిమళం

“శ్రీగురు అకట వాసిగ కాలదన్నిన
మేరువానందంబు జేరు పూజ
నిలుపవే భజియించు నెపమున లింగన
నీరూపునతులిత నిరవగుణము
సర్వేశుకడునర్థి బర్చిన చూడ్కిని
సంకీర్ణజైమిని సాటికాయ
తటితటి సన్ననోనిరత కాయమునందు
కనువిచ్చుదును సర్వగతమనంగ

జెలగి నలి ప్రాణ లింగం బు జేసియనుప
నీవె కర్తవు తనువెల్ల నిర్మలముగ
నేదెసను జూచి కనుమూయ మోద మెసగ
ధరనవశ్యంబు కరుసున దనరియొప్ప“

ఇది పాల్కురికి సోమనాథుని చెన్నమల్లు సీసములు అనే 32 సీసపద్యముల లఘు కావ్యం.ఆశ్చర్యం ఏమిటంటే ఈ ముప్పై రెండు పద్యాలను వరుసక్రమంలో గుర్తుంచుకోవడం కోసం వాటి మొదటి పదాల కూర్పు తో ఏర్పడ్డ ముప్పై మూడవ పద్యం ఇది.పాలకురికి సోమనాథుని గురించి విశేష పరిశోధనలు చేసిన కీ.శే డాక్టర్ వేణుముద్దల నరసింహా రెడ్డి గారు వీటి వివరాలు తమపరి శోధనలో పొందుపరిచారు. మకుట నియమం, వృత్త నియమం పాటించడం వల్ల దీనిని లఘు శతకం గా భావించ వచ్చు. పద్యాంతంలో చెన్నమల్లు అను సంబోధన తో షట్స్థల వివరణాత్మకమగు శివ పారమ్యస్థితిని సోమనాథుడు ఈ పద్యాలలో చాటినాడు.వీర శైవం నందు అత్యంత ప్రాధాన్యం గలిగినది ఈ షట్స్థల విజ్ఞానం. వీరశైవ సారభూతమైన లింగాంగ సామరస్యం గురించి ఇది తెలుపు తుంది. భక్త ,మహేశ్వర, ప్రసాది, ప్రాణలింగి, శరణ, ఐక్య అను ఆరు షట్స్థలాల పేర్లు. స్థల మనగా శివుడే. ఈ స్థలమే ఉపాస్య, ఉపాసక భేదములచే లింగ స్థలం,అంగ స్థలం అనే రెండు రూపాలు పొందింది.లింగస్థల ముపాస్యము, అంగస్థల ముపాసకము. అంగస్థలము జీవుడు, లింగ స్థలం శివుడు. లింగాంగ సామరస్యం కలుగుటకు మహా వాక్యం, పంచాక్షరీ మంత్ర జ్ఞానం ఎంత ముఖ్యమో షట్స్థల విజ్ఞానం కూడా అంతే ఆవశ్యం.తత్త్వమసి అను వాక్యంలో తత్ అనునది లింగంను, త్వం అనునది అంగమును, అసి యనునది లింగాంగ సామరస్యం తెలుపుతుంది.ఇది ప్రధానంగాచెన్నమల్లు సీసాల సారం వీరశైవ తాత్త్వికత.

ఇక మన పద్యం చూద్దాం.ఇది ముప్పై రెండు పద్యాల క్రమాన్ని సూచిస్తుంది.ఉదాహరణకు మొదటి పద్యం **శ్రీ గురు లింగ సంచిత** అని ప్రారంభం అవుతుంది.అందులో మొదటి పదం శ్రీ గురు మన పద్యం లో మొదటి పదం.అలాగే రెండవ పద్యం అకట ప్రమథుల అనీ మూడవ పద్యం కాలదన్నిన అనే పదం తోనీ ప్రారంభం అవుతాయి.వీటిలో అకట,కాలదన్నిన అనేపదాలు తీసుకోవడం తో మన పద్యం శ్రీ గురు అకట వాసిగ కాలదన్నిన అని ప్రారంభమైంది.వీరశైవంలో ఆ కాలంలో ఇవి బహుళ వ్యాప్తి లో ఉండడంతో వీటిని గుర్తుంచుకోవడం కోసం ఈ పద్యం వ్రాయబడింది.ఈ కవి కాలము క్రీ.శ 1160-1260 గా పరిశోధకులు నిర్ణయించారు.

# అవధాన విద్యా వాచస్పతి చెఱువు సత్యనారాయణ శాస్త్రి గారి అవధాన సేవ

- ఆచార్య తాడేపల్లి పతంజలి

## ప్రవేశిక:

**అవధాన విద్యా తాత్త్వికత - శాస్త్రి గారి ప్రవేశం**

భారతీయ విజ్ఞాన వాఙ్మయంలో అత్యంత విశిష్టమైన, ప్రతిభా వ్యుత్పత్తులకు గీటురాయిగా నిలిచే ధారణా సాహిత్య ప్రక్రియ అవధానం. అవధానమనే పదానికి ప్రాచీన వేద సంప్రదాయంలో విశిష్టమైన స్థానముంది. వేద పఠనంలో ఒక పన్నం నుండి మరొక పన్నంలోకి మారేటప్పుడు అక్షర, స్వరవిన్యాసాలలో లోపం రాకుండా సుస్వరంగా అప్పగించడాన్ని అవధానమని, అలా అప్పగించే నిష్ణాతుడిని అవధాని అని వ్యవహరించేవారు.



కావ్యాలంకార సూత్రవృత్తిలో వామనుడు వివరించినట్లు చిత్తం యొక్క ఏకాగ్రతే అవధానం. వేద మంత్రోచ్చారణలో స్వల్ప స్వర దోషం దొర్లినా అనర్థాలు సంభవిస్తా యనడానికి త్వష్ట ప్రజాపతి యజ్ఞ ఉదంతమే తార్కాణం; ఇంద్రుని సంహరించే కుమారుని కోరుతూ చేసిన ఉచ్చారణలో స్వరదోషం వల్ల ఇంద్రునిచే హతుడయ్యే వృత్రుడు జన్మించాడని పత్యె పూర్వ ప్రజ్ఞాచార్యులు స్పష్టం చేశారు.

అలాగే లౌకిక సంస్కృతంలో ధర్మపత్నిని సూచించే 'పాణిగృహీతి' శబ్దానికి, ఉంపుడుగత్తెను సూచించే 'పాణిగృహీతా' శబ్దానికి కేవలం ఒక వర్ణమే వ్యత్యాసమై కొండంత అర్థభేదాన్ని సృష్టిస్తుంది. (పాణిః గృహీతః యస్యాః యస్యా యథా కథంచిత్ విధిం వినా పాణిః గృహ్యతే సంస్కారము లేకుండ చేయి పట్టుకున్న స్త్రీ; ఉంపుడుకత్తె.) ఇటువంటి ఏకాగ్రత, శబ్ద నియంత్రణ కాలక్రమంలో సాహితీ రంగంలో ప్రవేశించి అష్టావధానం, శతావధానం, సహస్రావధానాలుగా తెలుగు గడ్డపై మహావృక్షమై విలసిల్లింది. ఆ ఉభయ భాషా అవధాన రంగంలో అసమాన పాండిత్యంతో తనదైన ముద్ర వేసి, కవితా దిగ్గజంగా నిలిచిన మహనీయులు బ్రహ్మశ్రీ డాక్టర్ చెఱువుసత్యనారాయణ శాస్త్రి గారు.

డాక్టర్ చెఱువుసత్యనారాయణ శాస్త్రి గారు 1943 మార్చి 7న గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో శ్రీ చెఱువుశేషయ్య శాస్త్రి, శ్రీమతి లక్ష్మి దంపతులకు జన్మించారు. వీరి మాతా మహులు, విద్యాగురువులు ప్రసిద్ధ ఉపాసకులు, పండిత శిరోమణి అయిన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారు. తాతగారి శిక్షణలో శాస్త్రి గారు బాల్యంలోనే సంస్కృత పంచ కావ్యాలు, నైషధ కావ్యాన్ని ఔపాసన పట్టి, వ్యాకరణ సిద్ధాంత కౌముది, వేదాంత పంచదశి, నాటకాలంకార శాస్త్రాలను కూడా క్షుణ్ణంగా అభ్యసించారు.

వ్యాకరణ, సాహిత్య, భాషా ప్రవీణ పట్టాలతో పాటు సంస్కృతంలో ఎం.ఏ. పూర్తి చేసి, "సంస్కృత మాఘకావ్యము - ఆంధ్రీకృతులు: అనుశీలనము" అనే పరిశోధనా గ్రంథానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. తెనాలిలో సంస్కృతోపాధ్యాయుడిగా వృత్తి జీవితం ఆరంభించి, తాడికొండ, గుంటూరు, ఒంగోలు సంస్కృత కళాశాలలలో అధ్యాపకుడిగా, ప్రధానాచార్యుడిగా సేవలు అందించి, చివరగా తణుకులోని బాలసరస్వతీ సమాజ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. తణుకు నన్నయ భట్టారక పీఠం కార్యదర్శిగా 'వారం వారం సాహితీ సమారాధన' కార్యక్రమం ద్వారా అనేకమంది వర్ధమాన కవులను తీర్చిదిద్దారు.

శాస్త్రి గారిలో అవధానికి కావలసిన వివేకము, విషయ పరిజ్ఞానము, ధారణాశక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి. వీరు తెలుగులో 125 అష్టావధానాలు, సంస్కృతంలో 25 అష్టావధానాలు, ఒక సంపూర్ణ సంస్కృత శతావధానాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. వీరి అసమాన ప్రతిభకు మెచ్చి చోడవరం ప్రసన్న భారతి సంస్థ 1981 జనవరి 26న 'అవధాన విద్యా వాచస్పతి' బిరుదును ప్రదానం చేయగా, మచిలీపట్నంలో 'అవధాన శిరోమణి', కొవ్వూరు సభలో 'ఉభయ భారతి' బిరుదులతో పండితలోకం వీరిని సత్కరించింది. **(సశేషం)**

## 27.09.2026 ఆదివారం, భోళాశంకర మందిరంలో

# ఆశుకవితా పద్య విన్యాసంలో సాహిత్యలోకంలో అపూర్వ ఘట్టం

**పద్య సాహిత్య జగత్తులో అవధాన ప్రక్రియ అనేది కవి యొక్క ఏకాగ్రతకు, స్మృతిశక్తికి ఆశుకవిత్వ ధారకు అత్యున్నత పరీక్ష. ఒకే రోజులో వెయ్యికి పైగా పద్యాలను ఆశువుగా పూరించడం సాధారణమైన విషయం కాదు. ఇలాంటి అరుదైన, చరిత్రాత్మక సాహిత్యపు వేడుక సికింద్రాబాద్ గడ్డపై అత్యంత వైభవంగా జరిగింది.**

### వేదిక మరియు నిర్వహణ



'భక్తిసాధనము' పండరి రాధాకృష్ణ గారి పర్యవేక్షణ మరియు నిర్వహణలో సికింద్రాబాద్‌లోని న్యూ బోయిన్‌పల్లిలోని శ్రీ భోళాశంకర మందిరం ఈ సాహిత్య మహాయజ్ఞానికి వేదికైంది.

తేది 27.09.2026 ఆదివారం ఉదయం 8:10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం, రాత్రి 7:20 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. మధ్యలో కేవలం ఒక గంట సేపు భోజన విరామం మినహా, ఉదయం నుండి రాత్రి వరకు సాహిత్య ప్రియులకు పద్య పీయూషం అందించబడింది.

### శతావధాని అయితగోని వెంకటేశ్వర్లు ప్రతిభా విశేషాలు

ఈ బృహత్ కార్యక్రమంలో శతావధాని అయితగోని వెంకటేశ్వర్లు విలక్షణ ప్రతిభను చాటుకున్నారు. ఆయన కేవలం ఒక్క రోజు వివిధ అంశాల మీద ప్రాశ్నికులు అడిగిన విభిన్న ప్రశ్నలకు ఏమాత్రం తడబడకుండా, అద్భుతమైన పదసంపదతో, అత్యంత సమర్థవంతమైన ధారతో వెయ్యి ఒక్క (1001) పద్యాలను ఆశువుగా పూరించి సభికులను మంత్రముగ్ధులను చేశారు.

ఈ కార్యక్రమానికి ప్రముఖ అష్టావధాని అష్టకాల విద్యాచరణ్ సంచాలకులుగా వ్యవహరించి అత్యంత విజయవంతంగా నడిపించారు.

### అవధానంలో స్పృశించిన వివిధ అంశాలు

**వైవిధ్యభరిత పద్యధార:** ఈ శతావధానంలో కేవలం ఒకే రకమైన విషయాలు కాకుండా, సమాజానికి, ఆధ్యాత్మికతకు, ప్రకృతికి సంబంధించిన అనేక అంశాలపై ప్రశ్నలు వచ్చాయి. వాటన్నింటికీ అవధాని అంతే దీటుగా, మనోహరమైన పద్యాలను ఆశువుగా చెప్పారు.

**ఆధ్యాత్మికత & దైవత్వం:** గణేశుడు, శివుని మీద భక్తి పారవశ్యంతో కూడిన పద్యాలు; హరిహరుల రూపాలను అభివర్ణిస్తూ శివ కేశవ అభేదం గురించి చెప్పిన పద్యాలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**ప్రకృతి & పర్యావరణం:** ఎత్తైన పర్వతాల వర్ణన, పవిత్రమైన తీర్థయాత్రల విశిష్టత, జీవనాధారమైన నదుల గొప్పదనం మరియు ప్రాణధార అయిన మంచి నీటి ప్రాముఖ్యతను కళ్లకు కట్టేలా వర్ణించారు.

**చరిత్ర & సమాజం:** అన్నం పెట్టే కర్షకుల (రైతుల) కష్టాలు, దేశాన్ని పాలించిన రాజులు – చక్రవర్తుల వైభవం, మన సంస్కృతిని నిలబెట్టిన ప్రాచీన కాలపు అవధానులు మరియు నేటి కొత్త తరం అవధాన కవుల గొప్పతనాన్ని కీర్తించారు.

**గురుభక్తి & దేశభక్తి:** విద్యను, విచక్షణను నేర్పిన గురువుల పట్ల ఉండవలసిన వినయ విధేయతలను, దేశాన్ని కాపాడే సైనికుల త్యాగనిరతిని దేశభక్తితో కొనియాడారు.

**యువత భవిష్యత్తు:** నేటి నిరుద్యోగ యువత భవిష్యత్తు, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రేరణాత్మక అంశాలపై కూడా అద్భుతమైన పద్యాలను వెలువరించారు.

**ముగింపు:** 'భక్తిసాధనమ్' పండరి రాధాకృష్ణ కృషితో, భోళాశంకర మందిరంలో జరిగిన ఈ శతావధాన కార్యక్రమం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఒకే రోజులో 1001 పద్యాలను వివిధ అంశాలపై ఆశువుగా చెప్పి తెలుగు పద్యం గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పిన అవధాని అయితగోని వెంకటేశ్వర్లు ప్రతిభ అభినందనీయం, స్మరించదగ్గది.







అవధాన పుష్కరిణిలో వికసించిన తొలి శతదళపద్మం
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలి శతావధాన విజయోత్సవ సభలో
మహాసహస్రావధాని డా.గరికిపాటి నరసింహా రావు గారి వాత్సల్య పూర్వకాభినందనం

అవధాన విద్యా విజయతే తరామ్

**Avadhana Puskarini**
12 OCTOBER 2026

# అవధాన పుష్కరిణి 2025-26 వార్షిక సంచిక

అవధాన పుష్కరిణి శ్రేయోభిలాషులు, అవధాన విద్యాభిమానులు,
ఛాత్రావధానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఘడియ రానేవచ్చింది.
2025 సెప్టెంబరు దసరా పర్వదినం సందర్భంగా ప్రారంభించబడిన
'అవధాన పుష్కరిణి' అంతర్జాల మాసపత్రిక మీ అందరి ఆదరాభిమానాలతో
ఏడాది పూర్తి చేసుకొని రెండవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది.




ఇప్పటివరకు అంతర్జాల వేదికల ద్వారా మిమ్మలను అలరించిన
అవధానపుష్కరిణిలో ధారావాహికంగా ప్రచురింపబడిన
ఉద్దండ పండితుల వ్యాసాలు, విశేషమైన వ్యాసాలు
అన్నీ కలిపి ఇప్పుడు అక్టోబరు మాసాంతానికి 'వార్షిక సంచిక'గా
అచ్చులోకి రాబోతున్నది. డిటిపి ప్రతి సిద్ధమయింది.
ఇక ముద్రణకు వెళ్ళడమే తరువాయి.
సుమారు 332 పుటలతో ముద్రింపబడుతోన్న ఈ ప్రత్యేక సంచిక ఇది.

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
R.No. 691/2026
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146